

మహబూబాబాద్ జనజాతర సభలో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



సభకు హాజరైన జనం

మానుకోట 'జన జాతర'లో ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

# మానుకోట ఎప్పటికీ.. కాంగ్రెస్ కంచుకోటే

- దశాబ్దం పాటు దగా చేసిన బీజేపీ, బీఆర్ఎస్‌కు ఓట్లు అడగడానికి సిగ్గుండాలి
- ఉక్కు, కోచ్ ఫ్యాక్టరీలను అడ్డుకున్న బీజేపీ
- కమ్యూనిస్టులతో రేపో, మాపో 'కూటమి' చర్చలు పూర్తి
- మహబూబాబాద్ కాంగ్రెస్ జనజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి

మహబూబాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మానుకోట ఎప్పటికీ కాంగ్రెస్ కంచుకోటగానే ఉంటుందని, ఈ ప్రాంతానికి దశాబ్దకాలం పాటు అన్యాయం చేసిన ద్రోహులు బీజేపీ, బీఆర్ఎస్‌కు ఓట్లు అడగడానికి సిగ్గుండాలి అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం సాయంత్రం జరిగిన కాంగ్రెస్ పార్టీ జనజాతర సభలో ఆయన మాట్లాడుతూ... గతంలో పార్లమెంట్‌లో తెలంగాణ వద్దన్న మోదీ.. ఇప్పుడు తెలంగాణ అభివృద్ధి అడ్డుకుంటున్నారని విమర్శించారు. అలాంటి బీజేపీకి ఓట్లు వేయాలంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఓట్లు ఏం మొఖం పెట్టుకుని అడుగుతున్నారని, ఆయనకు సిగ్గుండాలని ధ్వజమెత్తారు. ఇక ఇండియా కూటమితో కలిసి రావడానికి కమ్యూనిస్టులు, తెలంగాణ జనసమితి, ప్రజాసంఘాలతో చర్చించే బాధ్యతను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అప్పగించామని, రేపో, ఎల్లుండో ఆ చర్చలు పూర్తవుతాయన్నారు. తద్వారా కలిసొచ్చే ప్రజాస్వామ్య శక్తులతో ఇండియా కూటమి గెలుపు ఖాయమని, రాహుల్‌గాంధీ ప్రధానిగా ఎర్రకోటపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడం తథ్యమన్నారు. తెలంగాణలో సర్పంచ్‌ల స్థాయి నుంచి ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రుల వరకు పదేళ్ల పాటు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నా... మహబూబాబాద్ ప్రాంతానికి ఏం చేశారని ప్రశ్నించారు. అలాంటి అభివృద్ధి చేయని బీఆర్ఎస్‌ను గత అసెంబ్లీ ఎన్నికల్లో బండకేసి కొట్టారని గుర్తు చేశారు. తిరిగి లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలన్నారు.



సీఎంకు నాగలి, భద్రాద్రి సీతారామచంద్రస్వామి జ్ఞాపికలను బహూకరిస్తున్న నాయకులు

### బీజేపీ, బీఆర్ఎస్ తోడుదొంగలు..

ఢిల్లీలో మోదీ... తెలంగాణలో ఫాంహౌజ్ కేడీ ఇద్దరు తోడు దొంగలేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందం కుదిరిందని, అందుకే రాష్ట్రంలో ఐదు సీట్లలో బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. రైతు వ్యతిరేక నల్లచట్టాలు, 370 ఆర్టికల్, తదితర అమలుకు మోదీకి అండగా నిలబడి గెలిపించాయన్నారు. ఆ కవిత ఐనా.. ఈ కవిత ఐనా ఒక్కటేనంటూ కల్వకుంట్ల కవితను, మహబూబాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవితను ఉద్దేశించి వ్యాఖ్యలు చేసిన ఆయన బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ, వరంగల్‌కు

▸▸ మిగతా 7వ పేజీలో..



అభివాదం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, మానుకోట ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్



సీఎం ప్రసంగ సమయంలో కేరింతలు కొడుతున్న కార్యకర్తలు

# శ్రేణుల్లో జోష్

- మానుకోటలో ముఖ్యమంత్రి తొలిసభ సక్సెస్
- మండుటెండలో వచ్చి.. గంటన్నర వేచి ఉన్న సీఎం
- వేడిమిలోనూ 23 నిమిషాలు ప్రసంగం
- జనం చప్పట్లు, కేరింతలతో మార్మోగిన ప్రాంగణం

మహబూబాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మానుకోట జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపును కాంక్షిస్తూ శుక్రవారం సాయంత్రం నిర్వహించిన 'జనజాతర సభ' సక్సెస్‌తో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ కనిపిస్తోంది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక రేవంత్‌రెడ్డి తొలిసారి మహబూబాబాద్ పట్టణంలో జరిగిన సభకు హాజరవడంతో పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. రేవంత్‌రెడ్డి ఉత్తేజపూరిత ప్రసంగం హస్తం పార్టీ నేతల్లో జోష్ నింపింది. స్వరాష్ట్రంలో పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తెలంగాణలో అత్యధిక స్థానాల్లో ఎంపీలను గెలుచుకునేలా ప్రణాళికలు రచిస్తూ.. వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గంలో మూడుసభలను ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్న కాంగ్రెస్.. ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత అటు మహబూబ్‌నగర్‌లో రోడ్‌షో చేపట్టగా, మొదటగా మహబూబాబాద్‌లో తొలి జనజాతర సభను నిర్వహించడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండడంతో సభ విజయవంతాన్ని ప్రతిష్ఠాత్మకంగా

▸▸ మిగతా 7వ పేజీలో..

# ఏడాదైనా చర్యలేవీ?

- విచారణతోనే సరి... చర్యలపై అలసత్వం
- డీఈవో తీరుపై ఉపాధ్యాయుల ఆగ్రహం

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 19: తప్పులు చేసిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవడంతో వరంగల్ డీఈవో ఉదాసీన వైఖరి చూపుతున్నట్లు ఉపాధ్యాయులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయినప్పటికీ పూర్తిస్థాయి విచారణ చేపట్టేందుకు సంవత్సర కాలం తీసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పూర్తిస్థాయి విచారణ పూర్తయ్యి నెల రోజులు దాటుతున్నా సదరు తప్పులు చేసిన ఇద్దరు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవడంలో డీఈవో తాత్సారం చేస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల నేతలు విమర్శిస్తున్నారు.

గత ఏడాది మార్చి 19న 'విద్యార్థులతో మూల్యాంకనం..' పేరుతో ఆంధ్రజ్యోతి మెయిన్ ఎడిషన్‌లో కథనం ప్రచురితమైంది. కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు డాక్టర్ దుర్గం రవి, బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు ఎన్.సుదర్శన్‌లు విద్యార్థులతో జవాబు పత్రాలను మూల్యంకనం చేయించిన విషయం సంబంధిత ఎంఈవో విజయ్‌కుమార్ చేపట్టిన ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది.

పూర్తిస్థాయి విచారణ సైతం ముగిసి నెల రోజులు గడుస్తున్నా వారిపై చర్యలు తీసుకోవడంలో డీఈవో అలసత్వం ప్రదర్శించడంపై ఉపాధ్యాయులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. చిన్నచిన్న సంఘటనలో వెనువెంటనే చర్యలు తీసుకుంటున్న డీఈవో, నిబంధనల మేరకు యాక్టు 25 ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉండగా సదరు ఇద్దరు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవడంలో కావాలనే కాలయాపన చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. అమెరికాలో ఉన్న ఉపాధ్యాయురాలికి వేతనం మంజూరు చేసిన విషయంలోనూ అప్పుడు ఇన్‌చార్జి హెడ్మాస్టర్‌గా ఉన్న డాక్టర్ దుర్గం రవిపై చర్యలు తీసుకోవడంతో డీఈవో కాలయాపన చేస్తున్నారని మండిపడుతున్నారు.

# ఓనర్ షిప్ తంటాలు

- ప్రభుత్వ కొర్రీలు.. ప్రజలు గగ్గోలు
- సొంత భూమినీ రిజిస్ట్రేషన్ చేసుకోలేని వైనం
- విస్తీర్ణం ఎక్కువైనా నో పర్మిషన్
- నాలా కన్వర్షన్‌కూ ఇబ్బందులే...

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 19: ప్రభుత్వ నిబంధనలు ప్రజలకు తలనొప్పిగా మారుతున్నాయి. తాతలు, తండ్రులు సంపాదించిన ఆస్తిని తమ పేర్లపై రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు తంటాలు పడుతున్నారు. ఏండ్లుగా ఆ ఇంటి స్థలంలోనే ఉంటూ, గ్రామ పంచాయతీలకు, మునిసిపాలిటీకి పన్నులు కడుతున్నా ఓనర్ షిప్ (ఇంటి యాజమాన్య ధ్రువీకరణ పత్రం) సర్టిఫికేట్ ఇచ్చేందుకు అధికారులు రూల్స్ అడ్డొస్తున్నాయని, హైకోర్టు ఆర్డర్స్ ఉన్నాయంటూ చెపుతున్నారు. దీంతో వారి అవసరాల నిమిత్తం ఇంటిని రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు వ్యవసాయ భూములను నాలా కన్వర్షన్ (వ్యవసాయేతర భూములుగా మార్చడం) చేయాలన్న రెవెన్యూ అధికారులు సైతం కొర్రీలు విధిస్తున్నారు. ఎకరాల కొద్ది భూములను కొనుగోలు చేసి రియల్ ఎస్టేట్ చేసే వ్యాపారస్థులకు నాలా కన్వర్షన్ పెద్ద తలనొప్పిగా మారింది.

### అధికారుల కొర్రీలు...

ప్రస్తుతం అన్ని విధానాలను ప్రభుత్వం ఆన్‌లైన్ చేసింది. గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి ఏ సర్టిఫికేట్ పొందాలన్నా ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాల్సిందే. ఓనర్ షిప్ కోసం ఆన్‌లైన్‌లో అప్లై చేసుకున్నా సర్టిఫికేట్ ఇచ్చేందుకు గ్రామాల సెక్రటరీలు వెనకడుగు వేస్తున్నారు. పన్నులు సక్రమంగా కడుతున్నా, నో డ్యూ సర్టిఫికేట్ ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ఓనర్‌షిప్ బదులుగా ఇంటి నెంబరును ధృవీకరిస్తున్నట్లుగా మాత్రమే ఇవ్వడంతో ఇంటిని రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సబ్ రిజిస్టార్ కార్యాలయంలో వారి నిబంధనల ప్రకారం ఇంటి యజమాని ఇతనే అన్నట్లుగా సర్టిఫికేట్ ఉండాలి. లేదా 30ఏళ్లుగా ఆ ఇంటిలోనే నివసిస్తున్నట్లు ధ్రువీకరించాలి. వీటన్నింటికీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇంటి స్థలం విస్తీర్ణం ఎక్కువైతే మా పరిధిలో లేదంటూ దాటవేస్తున్నారు.

### నాలా కన్వర్షన్‌కు ఇబ్బందులే...

సాగు చేసే వ్యవసాయ భూములను నివాస గృహల స్థలాలుగా, పరిశ్రమల కోసం వాడేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం తప్పనిసరిగా నాలా కన్వర్షన్ ఉండాలి. ధరణి వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుని వ్యవసాయేతర భూమిగా రెవె న్యూ అధికారులు మార్చినట్లు ధ్రువీకరిస్తేనే సబ్ రిజిస్టార్ కార్యాలయంలో ఆ భూమి రిజిస్ట్రేషన్ అవుతుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే వ్యక్తులు ఎకరాల చొప్పున కొను గోలు చేసి, వాటిని ప్లాట్లుగా మలిచి నాలా కన్వర్షన్ చేసుకుని అమ్మకాలు చేసుకోవాలి. దీనికి గాను నాలా అనుమతులు ఒకేసారి కాకుండా ప్లాట్లలో చదరపు గజాల చొప్పున(గుంటల వారిగా) అనుమతులు ఇస్తున్నారు. దీంతో వ్యవసాయ భూమిని అమ్ముకున్న రైతులు కార్యాలయాల చుట్టూ తిరగలేకపోతున్నారు. కొన్నిచోట్ల అధికారులు నాలా విస్తీర్ణం ఎంతైనా చేస్తున్నారని, మరికొన్ని చోట్ల చేయడం లేదంటున్నారు.

### గ్రామాల్లో కార్యదర్శుల ఇష్టారాజ్యం..

ప్రజలకు గ్రామ పంచాయతీ పరిధిలో జారీ చేయాల్సిన సర్టిఫికేట్లపై సెక్రటరీలు ఇష్టారాజ్యంగా వ్యవహ రిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో అప్లై చేసిన వాటిని డిజిటల్ కీ ద్వారా ధ్రువీకరించేందుకు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. జనన, మరణ పత్రాలు, వివాహ సర్టిఫికేట్లు, ఇతర ప్రభుత్వ పథకాలు పొందేందుకు అందించే సర్టిఫికేట్ల విషయాల్లో అందుబాటులో లేకుండా కిందిస్థాయి సిబ్బంది ద్వారా చెప్పించి ప్రజలను వేధింపులకు గురిచేస్తున్నారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన పత్రాల కోసం వస్తే ఇవ్వమంటూనే చేతులు తడిపితే పనైపోతుందని సిగ్నల్స్ ఇస్తున్నారు. గ్రామాల్లో సర్వే నెంబర్లు సరిగ్గా లేకపోవడంతో నాలా కన్వర్షన్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు సెక్రటరీలను గుప్పిట్లో పెట్టుకుని ప్లాటులో ఇల్లు ఉన్నట్లుగా ఇంటి నంబర్లను కేటాయించి, రిజిస్ట్రేషన్ అయ్యేలా చూస్తున్నారు. తద్వారా నాలా కన్వర్షన్‌లేని వ్యవసాయ భూములు సైతం ప్లాట్లుగా రిజిస్ట్రేషన్ అవుతున్నాయి. వారసత్వంగా వచ్చిన స్థిరాస్థి రిజిస్ట్రేషన్‌కు కొర్రీలు పెడుతున్నట్లు వాపోతున్నారు.



వర్ధన్నపేట శివారులో చేసిన వెంచర్లు

### నిబంధనల్లో లొసుగులతో అక్రమాలు..

ప్రభుత్వం విధిస్తున్న నిబంధనలు ఓ స్థాయిలో అవినీతికి ఆస్కారంగా కనిపిస్తోందని విశ్లేషకులు చెపుతున్నారు. ప్రజలకు ప్రభుత్వం నుంచి అనుగుణంగా పాలన అందిస్తే అవినీతికి ఆస్కారం ఉండదని చెపుతున్నారు. నిబంధనల పేరిట అధికారులు డబ్బులు గుంజేందుకు ఇలా చెపుతున్నారనే ధోరణితో ప్రజలు సైతం అడ్డదారిలో పనులను చేయించుకుంటున్నారు. ప్రజలకు సరళతరంగా సేవలు అందితే ఎలాంటి చిక్కులు ఉండవని అభిప్రాయ పడుతున్నారు. సొంత ఇండ్లను, స్థలాలను, వ్యవసాయ భూములను రిజిస్ట్రేషన్ సక్రమంగా అయ్యేలా చేస్తే బాగుంటుందని చెపుతున్నారు. ఆన్‌లైన్ పేరిట అధికారులు దాట వేత ధోరణి ప్రదరిస్తూ, మళ్లీ తిరిగి చేతులు తడిపిన వారికి కొన్ని చోట్ల అనుమతులు ఇవ్వడం వలన ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోతున్నారు. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసుకునే స్థలాల విషయంలో పునరాలోచన చేయడంతో పాటు గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల్లో విధించిన నిబంధనలు ఎత్తేసేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

### నిబంధనలు సడలించాలి...

**- పానుగోటి చందర్‌రావు, బండౌతపురం**



ప్రభుత్వం భూముల రిజిస్ట్రేషన్‌లలో పెట్టిన నిబంధనలు సడలించాలి. గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల ద్వారా ప్రజలకు వారి ఇంటి అనుమతులపై సరళతరంగా ఉండేలా చూడాలి. అప్పుడే అవినీతికి అడ్డుకట్ట పడుతుంది. ప్రభుత్వ కఠిన నిబంధనలతోనే ప్రజలు లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వేరే మార్గాలను ఎంచుకుంటున్నారు. ప్రభుత్వం వీటిపై దృష్టి సారిస్తే ప్రజలకు ఇబ్బందులు లేకుండా పోతాయి.



# పసిడి ధరలు పైపైకి..

- తులం రూ.76,110, వెండి కిలో రూ.85,600

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్19: బంగారం ధరలు రోజురోజుకూ ఎగబాకుతున్నాయి. నెల రోజుల కిత్రం తులం రూ.62వేలు దాటిన బంగారం శుక్రవారం రూ.260 పెరిగి తులం రూ.76,110 రికార్డు నెలకొల్పింది. ఏప్రిల్ 19న రూ.76వేల మార్క్‌ను దాటగా, తాజాగా రూ.76,110 చేరింది. కనకంతో పాటే వెండి ధరలు కూడా పెరిగాయి. రూ.60వేలకు కిలో ఉన్న వెండి శుక్రవారం నాటికి రూ.85,600 లకు చేరింది. శుక్రవారం 22క్యారెట్ల బంగారం తులం రూ.70వేలకు పలికింది. ఇటీవల పెళ్లిళ్ల సీజన్ ముగిసినా బంగారం ధర పెరు గుతూనే ఉంది. రాబోయే రోజుల్లో బంగారం ధర మరింత పెరుగనున్నట్లు పరిశీలకులు భావిస్తున్నారు.

# రూ.7.72లక్షల నగదు పట్టివేత

మట్టెవాడ, ఏప్రిల్ 19: వరంగల్ పోలీసు సబ్ డివిజన్ పరిధిలో సరైన అధారాలు లేకుండా తరలిస్తున్న రూ.7.72 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్టు శుక్రవారం వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ తెలిపారు. వరంగల్ శివనగర్, నర్సంపేట రోడ్డు, మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలో తదితర ప్రాంతాల్లో విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టినట్టు తెలిపారు. తనిఖీల్లో వరంగల్ చార్‌బౌళికి చెందిన చిన్నపల్లి దిలీప్ వద్ద నుంచి రూ.6.70 లక్షలు, వరంగల్ శాంతినగర్‌కు చెందిన రూ. 1.02లక్షల నగదు స్వాధీన పర్చుకున్నట్లు ఏసీపీ వెల్లడించారు. శుక్రవారం వాహన తనిఖీల్లో మొత్తం రూ.7.72 లక్షలు స్వాధీన పర్చుకొని ఎలక్షన్ ఫ్లైయింగ్ స్క్వాడ్‌కు అందజేసినట్లు తెలిపారు. తనిఖీలో మిల్స్‌కాలనీ, ఇంతేజార్‌గంజ్, ఇన్‌స్పెక్టర్ ఇన్‌స్పెక్టర్లు మల్లయ్య, మచ్చ శివకుమార్, తుమ్మ గోపి, ఎస్సైలు విఠల్, వెంకన్న, గాలిబ్ షరీఫ్, మునిరుల్లా, గోవర్ధన్ పాల్గొన్నారన్నారు.



శివనగర్‌లో డబ్బును స్వాధీనం చేసుకుంటున్న ఏసీపీ



**శుక్రవారం ఉష్ణోగ్రతలు**
**గరిష్ఠం : 38.0°C**
**కనిష్ఠం : 22.0°C**

# నీ జాతకం బయటపెడతా..

- వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించను
- పార్టీలకు వెన్నుపోటు పొడవడం నీకు అలవాటే..
- ఏ వ్యాపారం చేశావని ఇక్కడ ఇల్లు, హైదరాబాద్‌లో ఫ్లాట్లున్నాయి?
- ఎమ్మెల్యే కడియంపై అరూరి ఆగ్రహం

హనుమకొండ టౌన్, ఏప్రిల్19: తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తే ఖబర్దార్.. నీ జాతకమంతా బయట పెడుతా.. అని వరంగల్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్ కడియం శ్రీహరిని హెచ్చరించారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని వరంగల్ బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అరూరి మాట్లాడుతూ.. పూటకోరకంగా మాట్లాడుతున్న కడియం మాటలకు ఊసరవెల్లే తలదించుకునేలా ఉందని ఎద్దేవా చేశారు. మాదిగలకు ఏమి చేశావని ఆ జాతి బిడ్డలు ప్రశ్నిస్తుంటే ఆ అంశాన్ని పక్కదారి పట్టించేందుకు తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నాడని ధ్వజమెత్తారు. ఎన్టీఆర్‌కి వెన్నుపోటు పొడిచి చంద్రబాబు వంచన చేరాడని, అక్కడ అదే వైఖరితో వ్యవహరించి కేసీఆర్ చెంతన చేరి డిప్యూటీ సీఎం, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేగా పదవులు అనుభవించాడన్నారు. తాజాగా బిడ్డకు ఎంపీ టికెట్ చేజిక్కించుకొని చివరికి కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్‌లో చేరాడని ఆరోపించారు. వర్ధన్నపేటలో అభివృద్ధి జరగలేదని అసత్య వ్యాఖ్య లు చేస్తున్న కడియం.. మంత్రిగా ఉన్న సమయంలో వర్ధన్నపేట పర్యటనకు వచ్చి 'అరూరి రమేశ్ హంషారు.. నిధులన్నీ వర్ధన్నపేటకు తెచ్చుకొని అభివృద్ధి చేశాడు' అని ఆనాడు వివరించిన విషయాన్ని మరిచిపోయావని గుర్తుచే శారు. భూ బకాసురుడు



సమావేశంలో మాట్లాడుతున్న అరూరి రమేశ్

▸▸ మిగతా 8వ పేజీలో..

## వాహనదారులకు జరిమానా

హనుమకొండ టౌన్, ఏప్రిల్19: నిబంధనలు ఉల్లఘించిన 20మంది వాహనదా రులకు జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ షూకూర్ తెలిపారు. 20 మందిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రమేశ్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 10 మందికి 7,000 డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ 10 మందికి రూ. 7,000 జరిమానాను విధించారన్నారు.

# స్వార్థంతోనే ఆర్జేడీ కార్యాలయం తరలింపు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 19: ఇంటర్మీడియెట్ విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకుల కార్యాలయం(ఆర్జేడీ) హైదరా బాద్‌కు వెళ్లి సంవత్సర కాలం పట్టకుండానే తిరిగి వరంగల్‌లో ఏర్పాటు చేయాలని వచ్చిన ఉత్తర్వుల వెనుక చర్చనీయాంశ అంశాలున్నాయి. కడప, రాజమండ్రి, గుంటూరు, వరంగల్ ప్రాం తాల్లో ఇంటర్మీడియెట్ విద్యాశాఖ ఆర్జేడీ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1991లో అప్పటి ప్రభుత్వం జీవో నెం.139 ఉత్తర్వులను జారీ చేసింది. అందుకు అనుగుణంగా వరంగల్‌లో 1999లో ఆర్జేడీ కార్యాలయం ప్రారంభం అయ్యింది. అప్పటి నుంచి వరంగల్ కేంద్రంగా అప్పటి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల ఇంటర్మీడియెట్ ఉద్యోగులకు వివిధ సేవలు అందిస్తూ వచ్చింది. గత ఏడాది ఆర్జేడీ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఉన్నతాధికారి తన సౌలభ్యం కోసం వరంగల్ ఆర్జేడీ కార్యాలయాన్ని హైదరాబాద్‌కు తరలించే ందుకు అప్పటి కమిషనర్ నవీన్ మిట్టల్‌తో ఉత్తర్వులు జారీ చేయించినట్లు అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. కమిషనర్ తన విచక్షణా ధికారాలతో కార్యాలయాన్ని తరలించాలని ఉత్తర్వులు జారీ చేశారు. అయితే అప్పటి నుంచి నేటి వరకు ఆర్జేడీ, ఏవోలు వేతనాలు మాత్రం వరంగల్ నుంచే తీసుకుంటుండటం గమనార్హం. ఆర్జేడీ కార్యాలయాన్ని వరంగల్ నుంచి ఎత్తివేయాలంటే జీవో నెం. 139ని ప్రభుత్వం రద్దు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఆ జీవోను రద్దు చేయక పోవడం, సదరు ముఖ్యఅధికారి స్వలాభం కోసం కార్యాలయాన్ని తరలించడాన్ని సవాల్ చేస్తూ అధ్యాపక సంఘాల నాయకులు ఇద్దరు మంత్రు లను ఆశ్రయించి వారికి అసలు విషయం చెప్పా రు. దీంతో ప్రభుత్వం ఇంటర్ ఆర్జేడీ కార్యాల యాన్ని తిరిగి వరంగల్‌లోనే పునఃప్రారం భించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులతో అధ్యాపకులతో పాటు విద్యార్థి సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఔట్ సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 19 : నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసేందుకు 12 పోస్టులకు ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కిషన్ శుక్రవారం తెలిపారు. పోస్టుల వివరాలిలా వున్నాయి. డిసెక్షన్ హాల్ అటెండర్ల పోస్టులు-4 ఉన్నాయని, వీటికి దరఖాస్తు చేసుకునేవారు 10వ తరగతి లేదా సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలని, అనాటమీ డిసెషన్ లేదా ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగంలో కనీసం సంవత్సరం అనుభవం ఉండాలన్నారు. ల్యాబ్ అటెండర్ పోస్టులు-4. ఇందుకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి బీఎస్సీ ఎంఎల్‌టీ లేదా డీఎంఎల్‌టీలో డిగ్రీ లేదా డిప్లొమా కలిగి ఉండడంతో పాటు తెలంగాణ పారామెడికల్ బోర్డుతో గుర్తింపు పొందాలన్నారు.

అలాగే థియేటర్ అనస్థీషియా అసిస్టెంట్ -4 పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారు అనస్థీషియా అసిస్టెంట్ కోర్సులో బీఎస్సీ ఎంఎల్‌టీ లేదా ఎంఎల్‌టీ ఉత్తీర్ణులై ఉండాలని, అలాగే తెలంగాణ పారామెడికల్ బోర్డుతో గుర్తింపు పొందాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు ఫారాలను పూరించి నర్సంపేట ఏరియా ఆస్పత్రిలో ఈ నెల 24వ తేదీన సాయంత్రం 5గంటల లోపు ఒక సెట్ జిరాక్స్ ప్రతులను సమర్పించాలని ప్రిన్సిపాల్ వివరించారు.

# ఆఫీసర్స్ క్లబ్ వర్కర్ ఆత్మహత్య

**తన చావుకు క్లబ్ సభ్యులు కారణమంటూ ఆడియో రికార్డు**



శ్రీనివాస్ మృతదేహం

వరంగల్ క్రైం, ఏప్రిల్ 19: హనుమకొండ ఆఫీసర్స్ క్లబ్‌లో పనిచేస్తున్న జి.శ్రీనివాస్ (42) మనస్థాపంతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి జరిగింది. తాను ఆత్మహత్య చేసుకోవడానికి క్లబ్ సభ్యులైన చెరుకు రాజిరెడ్డి, గోలి గోపాల్‌రెడ్డి, పొడిశెట్టి రవి ముగ్గురు కారణమని ఆడియో రికార్డులో మృతుడు ఆరోపించాడు. ఆత్మహత్య చేసుకునేముందు ముగ్గురిపై ఆరోపణలు చేస్తూ సెల్‌లో రికార్డు చేసి తన కుమారుడి సెల్‌కు పంపించాడు. వివరాలు ఇలా ఉన్నాయి.ఆఫీసర్ క్లబ్‌లో సభ్యత్వం పేరిట రాజిరెడ్డి, గోపాల్‌రెడ్డి, రవిలు దాదాపు రూ.1కోటి వరకు సభ్యత్వ రుసుము వసూల్ చేశారు. ఈ మొత్తంలో శ్రీనివాస్‌కు రూ.10లక్షలు ఇస్తామని ఒప్పుకున్నారు. ఒప్పుకున్న డబ్బులు ఇవ్వాలని శ్రీనివాస్ ముగ్గురు సభ్యులపై ఒత్తిడి తెచ్చినా స్పందన లేకపోవడంతో ఆత్మహత్య చేసుకుంటున్నానని పేర్కొన్నాడు. ఎంతకూ వారి నుంచి స్పందన లేకపోవడంతో సెల్‌లో రికార్డు చేసి కుమారుడికి పంపించి క్లబ్ పైఅంతస్తులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీనివాస్ సతీమణి కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నట్లు సుబేదారి పోలీసులు తెలిపారు. కేసు విషయాన్ని సీఐ సత్యనారాయణరెడ్డి ధ్రువీకరించారు.

## ఓటింగ్ శాతం పెంపునకు ప్రత్యేక చర్యలు

వరంగల్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య




సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటో దిగిన కలెక్టర్, అదనపు కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 19: ప్రజాసామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైందని, ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. ఓటింగ్ శాతం పెంచేందుకు జిల్లా యంత్రాంగం చేపడుతున్న చర్యల్లో భాగంగా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో సెల్ఫీ పాయింట్‌ను శుక్రవారం ఏర్పాటు చేశారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓలతో కలిసి సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటోలు దిగారు. కలెక్టర్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో వరంగల్ నగరంలో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైందని, పట్టణంలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు వినూత్న కార్యక్రమాల ద్వారా కళాజాత, 5కే రన్, ముగ్గుల పోటీలు, క్యాంపస్ అంబాసిడర్లను కళాశాలల్లో నియమించి విస్తృత ప్రచారం కల్పిస్తున్నట్లు తెలిపారు. వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించడమే కాకుండా కలెక్టరేట్, పబ్లిక్ గార్డెన్, వరంగల్ రైల్వే, బస్‌స్టేషన్ల వద్ద సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేసి యువతను ఓటు శాతం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మీ, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీసీఓ సంజీవరెడ్డి, ఏఓ శ్రీకాంత్, కలెక్టరేట్ పర్యవేక్షకులు విశ్వనారాయణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## రికార్డులను పటిష్ఠంగా నిర్వహించాలి

▸▸ ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఎ.దిలీబన్



రికార్డులను పరిశీలిస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఎ.దిలీబన్

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 19: ఎన్నికలకు సంబంధించిన ఖర్చుల రికార్డులను పటిష్ఠంగా నిర్వహించాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఎ.దిలీబన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండలోని కుడా కాంప్లెక్స్‌లోని జిల్లా సహకార కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల వ్యయ పర్యవేక్షణ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ వరంగల్ లోక్‌సభ స్థానానికి పోటీ చేస్తున్న రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రతి ఖర్చు వివరాలను సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ టీమ్‌లు సెగ్మెంట్ల వారిగా నమోదు చేయాలని తెలిపారు. లోక్‌సభ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో సహాయ వ్యయ పరిశీలన అధికారులతో సమన్వయం చేసుకొని ఆర్‌ఓ స్థాయిలో ప్రతిరోజు వ్యయ నివేదికలను క్రోడీకరించుకోవాలని సూచించారు. ర్యాలీలు, సమావేశాల ద్వారా నిర్వహించిన పార్టీ, ప్రచార ఖర్చులు నిర్ణయించిన ధరల ప్రకారం నమోదు చేయాలన్నారు. పోటీ చేసే అభ్యర్థులు తమ ప్రచార వ్యయ ఖర్చులు, వ్యయ అకౌంట్, రిజిష్టర్లు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. నామినేషన్ వేసిన తర్వాత ఎన్నికల సందర్భంగా, ఎన్నికల అనంతరం పరిశీలన చేయనున్నారని, పరిశీలనకు మధ్య మూడు రోజుల వ్యవధి ఉండాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఎ.దిలీబన్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యయ నోడల్ అధికారి రామిరెడ్డి, సహాయ నోడల్ అధికారి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

# మానుకోట ఎప్పటికీ.. కాంగ్రెస్ కంచుకోటే

5వ పేజీ తరువాయి

కోచ్ ఫ్యాక్టరీ రాకుండా అడ్డుకుంది కేంద్రంలోని బీజేపీయేనని సీఎం రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. ఆయా ఫ్యాక్టరీలు రాకుండా ఆదివాసీలు, లంబాడీలు, ఇతరులు అభివృద్ధి చెందకుండా పాతరేసింది వారు కాదా అని ప్రశ్నించారు. గిరిజన యూనివర్సిటీ మంజూరయితే ఆదివాసీలు, లంబాడీలు, ఇతరులు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు అవుతారనే ఉద్దేశంతో మంజూరు ఆలస్యం చేసింది బీజేపీయేనని మండిపడ్డారు. ఎంపీలందరూ కలిసి కన్న తల్లి, దేవతలాంటి సోనియమ్మను అడిగితే తెలంగాణ రాష్ట్రం ఇచ్చిందని ఐనా సోనియమ్మ ఏనాడూ అధికారం కోసం పాకులాడలేదన్నారు. ఆ అమ్మ బిడ్డ రాహుల్‌గాంధీని ప్రధాని చేసి రుణం తీర్చుకోవాలన్నారు.

### నాడు బలరాం మంత్రి.. మళ్లీ గెలిస్తే ఇంకా పెద్ద పదవి

మహబూబాబాద్ తొలి ఎస్టీ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి గెలిచిన పోరిక బలరాంనాయక్‌ను సోనియమ్మ కేంద్ర మంత్రి చేశారని, ఈసారి కూడా ఆయన్ను గెలిపిస్తే అంతకన్న పెద్దస్థాయి పదవి ఆయనకు దక్కుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇరుగు, పొరుగున ఉన్న మహబూబాబాద్, ఖమ్మం ఎంపీ సీట్లలో కాంగ్రెస్ అభ్యర్థులకు అత్యధిక మెజార్టీ ఇవ్వడంలో గట్టి పోటీ నెలకొందని రేవంత్‌రెడ్డి అన్నారు. బలరాంనాయక్‌కు 3లక్షలకు తగ్గకుండా మెజారిటీ ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఇందుకు అందరు సిద్ధమేనా అంటూ పదే.. పదే ప్రశ్నిస్తూ సబీకుల నుంచి ఔననే సమాధానం చెప్పించారు. రేవంత్ ప్రసంగం ఆసాంతం కార్యకర్తలు కేరింతలు కొట్టారు. ఈ సభలో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి సీతక్క, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావ్, యశస్వినిరెడ్డి, ఏఐసీసీ సెక్రటరీ రోహిత్‌చౌదరి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణ, రాములునాయక్, పొదెం వీరయ్య, బెల్లయ్యనాయక్, మాలోతు నెహ్రూనాయక్, రవీంద్రనాయక్, రియాజ్, భూక్య ఉమా, నూనావత్ రాధ, మోహన్‌లాల్, నూకల నరేష్‌రెడ్డి, చుక్కల ఉదయ్‌చందర్, కంకర అయ్యప్పరెడ్డి, ఘనపురపు అంజయ్య, ఘంట సంజీవరెడ్డి, మేకల వీరన్న, బండారు వెంకన్న, పోరిక సాయిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్‌తో కలిసి అభివాదం చేస్తున్న సీఎం రేవంత్

## శ్రేణుల్లో జోష్

5వ పేజీ తరువాయి

తీసుకున్నారు. ఉదయం ఎంపీ బలరాం నాయక్ నామినేషన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యేలు ఇక్కడే ఉండి సభ విజయవంతానికి కృషి చేశారు. తమతమ నియోజకవర్గాల నుంచి ప్రజలను భారీగా తరలించడంతో సభ సక్సెస్ అయింది.

### సీఎం, మంత్రుల ప్రసంగాలతో హోరెత్తిన సభ..

ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిగా బాధ్యతలు చేపట్టాక మానుకోట జిల్లా కేంద్రంలో జరుగుతున్న తొలిసభ కావడంతో సీఎంను చూసేందుకు, ఆయన ప్రసంగం వినేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఎన్టీఆర్ స్టేడియం ప్రాంగణం కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులతో నిండిపోయింది. సభ నిర్ణీత సమయం సాయంత్రం 4 గంటలకు ఎండవేడిమితో జనం రాక కాస్త ఆలస్యమైనప్పటికి 5గంటల కల్లా ఎన్టీఆర్ స్టేడియం నిండిపోయింది. మిగిలిన వారు రోడ్లవెంట ఉండిపోయారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లపై ఎక్కుపెడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనసాగించిన ప్రసంగం కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది, ఆయన ప్రసంగించినంత సేపు జనజాతర సభ ప్రాంగణం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు కేరింతలు, చప్పట్లతో మార్మోగింది. పార్లమెంట్ ఎన్నికల్లో మెజార్టీలో మానుకోట, ఖమ్మం మొదటి, రెండుస్థానాల్లో నిలవబోతున్నాయని ఏ స్థానంలో నిలుస్తారో అంటూ ముఖ్యమంత్రి తన ప్రసంగంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు. దీనికి తోడు సభకు హాజరైన రాష్ట్రమంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క ప్రసంగాలు సైతం కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపాయి. సీఎం, మంత్రుల ప్రసంగాల మధ్యమధ్యలో జనం చప్పట్లు, కేరింతలు కొడుతూ, వారికి ఉత్సాహాన్ని నింపే ప్రయత్నం చేశారు.

### ఉద్రూతలు ఊగిస్తూ..

మహబూబాబాద్ కాంగ్రెస్ జనజాతర నిర్ణీత సమయం సాయంత్రం 4గంటలుగా ప్రకటించిన నేపథ్యంలో.. సీఎం రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ పర్యటన అనంతరం నేరుగా హెలికాప్టర్ ద్వారా మహబూబాబాద్ సభాస్థలి సమీపాన ఉన్న హెలిప్యాడ్‌కు 3.45 గంటలకే చేరుకున్నారు. 45 డిగ్రీలు దాటినా మండు టెండలో సభకు జనం ఆలస్యంగా వస్తుండడంతో సభా ప్రాంగణం కిటకిటలాడే వరకు ప్రత్యేక బస్సులోనే వేచి ఉన్నారు. సాయంత్రం 5.15 గంటలకు ఎన్టీఆర్ స్టేడియంలో వేదికపైకి చేరుకున్న ఆయన మంత్రులు, ప్రజాప్రతినిధుల ప్రసంగాలు పూర్తయ్యే వరకు అంటే 5.52గంటల దాకా సుమారు 2గంటల 7నిమిషాలు వేచి ఉన్నారు. తర్వాత వేదిక ముందు భాగాన ఏర్పాటు చేసిన ర్యాంప్‌పైకి నడుచుకుంటూ వెళ్లి ప్రజలకు అభివాదం చేసి తిరిగి వేదికపైకి చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి 23 నిమిషాల పాటు ఉద్రూతలూగిస్తూ నిరాటంకంగా ప్రసంగించారు.

# కేసీఆర్ చిప్పకూడు తినడం ఖాయం

▸▸ 20 మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారనడం అవివేకం ▸▸ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 19 : సీఎం రేవంత్‌రెడ్డిని లిల్లిపుట్ అంటున్న మాజీ సీఎం కేసీఆర్ చిప్పకూడు తినే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి పొంగులేని శ్రీనివాసరెడ్డి అన్నారు. మహబూబాబాద్ 'జన జాతర' సభలో ఆయన మాట్లాడుతూ 20 మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని, సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీలోకి పోతున్నారని, మంత్రి శ్రీనివాస్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లోకి వస్తున్నారని పోరంబోకు మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పాలనలో ఫోన్‌ట్యాపింగ్ చేయడం దౌర్భాగ్యమని ప్రతిపక్ష నేతలు కుటుంబ సభ్యులతో మాట్లాడిన వాటిని కూడా ట్యాప్ చేయడం దారుణమన్నారు. ఫోన్‌ట్యాపింగ్‌లో పాలుపంచుకున్న వారికి శిక్ష తప్పదని హెచ్చరించారు. రూ.10లక్షల కోట్ల నిధులు తెలంగాణకు ఇచ్చామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందని, రాష్ట్రం నుంచి కేంద్రానికి రూ.లక్షల కోట్ల శిస్తుకట్టలేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీకి నాలుగు సీట్లు కూడా రావనిచ బీఆర్‌ఎస్, బీజేపీలను చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. మానుకోటలో పోరిక బలరాం నాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలని కోరారు.

### రోల్ మోడల్ సీఎంగా రేవంత్‌రెడ్డి..

- వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రాష్ట్రంలో వందరోజుల పాలనలో ప్రజలకిచ్చిన ఎన్నికల హామీలను నెరవేరుస్తూ దేశంలో రోల్‌మోడల్ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి నిలిచారని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒకడు మూడునెలలు, మరొకడు ఆరునెలలు ఉంటుందని మాట్లాడుతున్నారని ఇది సరైంది కాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వంద రోజుల పాలనలోనే ఆరు గ్యారంటీల్లో ఐదు గ్యారంటీలను అమలు చేశారని, ప్రజలకు సేవచేయాలనే పట్టుదలతో వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి మద్దతుగా నిలిచి రాష్ట్రంలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. సోనియాగాంధీ ఆశీస్సులు, రాహుల్‌గాంధీ దీవెనలతో పోరిక బలరాం నాయక్ కేంద్రమంత్రిగా పని చేశారని, ఆయన్ను గెలిపించుకుంటే మళ్లీ ఈ ప్రాంత అభివృద్ధికి పాటు పడుతారని, ఆయనకు భారీ మెజార్టీ ఇవ్వాలని పిలుపునిచ్చారు.

### రెండు సిద్ధాంతాల మధ్య పోటీ..

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి సీతక్క

రాష్ట్రంలో రెండువర్గాలు, రెండు సిద్ధాంతాల మధ్య పోటీ జరుగుతోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి సీతక్క అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో దేశసంపదను దోచుకున్న, గాంధీజీని చంపిన గాడ్సే సిద్ధాంతాన్ని అవలంబిస్తున్న బీజేపీకి, దేశం కోసం ప్రాణాలర్పించి, గాంధీ సిద్ధాంతాన్ని కొన సాగిస్తున్న కాంగ్రెస్‌కు మధ్య పోటీ జరుగుతోందన్నారు. ప్రధాని మోదీ పదేళ్ల పాలనలో ఊరికో ఉద్యోగం ఇవ్వని బీజేపీ విద్వేషాలను రెచ్చగొట్టిందని విమర్శించారు. పేదల పక్షాన నిలిచేది కాంగ్రెస్ పార్టీ అని చెప్పారు. మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం రద్దు చేస్తారని, తద్వారా ప్రజల హక్కులు కోల్పోతారన్నారు. ప్రజల పక్షాన నిలిచే రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలన్నారు. బలరాంనాయక్ బోళా శంకరుడని, గతంలో కేంద్ర మంత్రిగా ప్రజాభ్యున్నతే ధ్యేయంగా పని చేశారని, మళ్లీ ఎంపీగా ప్రజా ఆశీర్వాదం కోసం వస్తున్నారని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

### అభ్యర్థి ఎవరో తెలుసుకోవచ్చు...




నియోజకవర్గంలో ఎంత మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారో తెలుసుకునేందుకు నో యువర్ క్యాండిడేట్ (కేవైసీ) అనే యాప్ ఉంది. దీని ద్వారా పోటీ చేసే అభ్యర్థి పేరుతోపాటు పూర్తి వివరాలు తెలుసుకునే అవకాశం ఉంది.

### ఓటర్ హెల్ప్‌లైన్...




ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా అనేక విషయాలు తెలుసుకోవచ్చు. ఓటరు జాబితాలో పేరు చెక్ చేసుకోవడంతోపాటు నూతనంగా ఓటరుగా నమోదు, తప్పులను సరిచేసుకునేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. ఓటరు గుర్తింపు కార్డు డౌన్‌లోడ్, నియోజకవర్గాల వారీగా ఓటరు జాబితా పొందవచ్చు.

### దివ్యాంగులు, వృద్ధుల కోసం



దివ్యాంగులు, వృద్ధుల కోసం సాక్షం యాప్ అందుబాటులో ఉంది. పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయలేని వారు ఈ యాప్‌లో పేరు నమోదు చేసుకోవాలి. సంబంధిత అధికారులు పరిశీలించి పోలింగ్ కేంద్రానికి తరలించేందుకు రవాణా సదుపాయం కల్పిస్తారు. వారికి ప్రత్యేకంగా ఒక సహాయకుడిని సైతం అందుబాటులో ఉంచుతారు.

- వరంగల్ కలెక్టరేట్





వరంగల్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్యకు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీ అభ్యర్థి ఏఆర్. నేనా ప్రేమ్ రెడ్డి రిపిక, స్వతంత్ర అభ్యర్థి పేరంబుదూరి కృష్ణసాగర్ , బీఎస్‌పీ అభ్యర్థి పంజా కల్పన

# ప్రశాంతంగా నామినేషన్ల పర్వం

## రెండోరోజు వరంగల్‌లో నాలుగు, మానుకోటలో ఐదు నామినేషన్లు

వరంగల్ కలెక్టరేట్ / మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 19: లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా సాగుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించి రెండోరోజైన శుక్రవారం మొత్తం తొమ్మిది నామినేషన్లు దాఖలయ్యాయి. వరంగల్‌లో ముగ్గురు అభ్యర్థుల ద్వారా నాలుగు నామినేషన్లు రాగా.. వరంగల్ కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీ అభ్యర్థిగా ఏఆర్. నేనా ప్రేమ్‌రెడ్డి రిపిక ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థిగా మరో సెట్, స్వతంత్ర అభ్యర్థి పేరంబుదూరి కృష్ణసాగర్ ఒక సెట్, బీఎస్‌పీ అభ్యర్థిగా పంజా కల్పన ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు.

మహబూబాబాద్ నియోజకవర్గంలో నలుగురు అభ్యర్థుల ద్వారా ఐదు నామినేషన్లు దాఖలు అయ్యాయి. మహబూబాబాద్ కలెక్టరేట్‌లో కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ములుగు నియోజవకర్గం, మదనపల్లి గ్రామానికి చెందిన పోరిక బలరాంనాయక్ రెండు సెట్లు దాఖలు చేశారు. ఆయన్ను మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి బలపరిచారు. అలాగే భద్రాద్రి జిల్లా పినపాక నియోజకవర్గం మణుగూరుకు చెందిన పాల్వాంచ దుర్గ స్వతంత్ర అభ్యర్థిగా, ఆధార్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా నర్సంపేట నియోజకవర్గం నెక్కొండ మండలం ముదిగొండ గ్రామానికి చెందిన జాటోతు రఘునాయక్, నర్సంపేట నియోజకవర్గం ఇటుకాలపల్లి గ్రామం ఏనుగుల తండాకు చెందిన బోడ అనిల్‌నాయక్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.



మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయంలో మహబూబాబాద్ నామినేషన్ పత్రాలను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు అందజేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్

### నామినేషన్ కౌంటర్



రెండో రోజు (19-4-2024)

| దాఖలైన మొత్తం నామినేషన్లు | |
|---|---|
| వరంగల్ | మహ-బాద్ |
| 07 | 06 |

| | |
|---|---|
| వరంగల్ (ఎస్సీ) | పంజా కల్పన (బహుజన సమాజ్ పార్టీ), ఏఆర్.నేనా ప్రేమ్‌రెడ్డి రిపిక (మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీ, స్వతంత్ర), పేరంబుదూరి కృష్ణసాగర్ (స్వతంత్ర). |
| మహబూబాబాద్(ఎస్టీ) | పోరిక బలరాం నాయక్ (కాంగ్రెస్-2 సెట్లు), పాల్వాంచ దుర్గ (స్వతంత్ర), జాటోతు రఘునాయక్ (ఆధార్‌పార్టీ), బోడ అనిల్‌నాయక్ (స్వతంత్ర). |



### విజయవాడ లోక్‌సభ స్థానానికి తరిగొప్పుల వాసి నామినేషన్



చెవిటి అర్జున్

తరిగొప్పుల, ఏప్రిల్ 19: ఏపీలోని విజయవాడ పార్లమెంట్ స్థానానికి జనగామ జిల్లా తరిగొప్పుల మండలం సోలిపూర్ గ్రామానికి చెందిన చెవిటి అర్జున్ నామినేషన్ వేశారు. గురువారం సాయంత్రం రిటర్నింగ్ అధికారి డిల్లీరావుకు తన ప్రతినిధి ద్వారా రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. అర్జున్ గత అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నియోజవకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసి విత్‌డ్రా చేసుకున్నారు. కాగా, నామినేషన్ విషయమై ఆయన మాట్లాడుతూ తను గుంటూరు జిల్లా జగ్గయ్యపేటలో ఉన్న స్నేహితులకు వద్దకు వెళ్లానని, వారి ప్రోద్బలంతో సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా పార్టీ తరుపున రెండు సెట్ల నామినేషన్‌లను తన ప్రతినిధి గుజ్జుల లలిత ద్వారా వేశానని అన్నారు.

### ఎన్నికల పరిశీలకులకు ఫిర్యాదు చేయండి

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 19: ఎన్నికల అంశాలకు సంబంధించి సందేహాల నివృత్తి, ఫిర్యాదుల కోసం మొబైల్ నెంబర్స్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ప్రావీణ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల వ్యయ పరిశీలకులకు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. స్టేషన్ ఘనపూర్, పాలకుర్తి, పరకాల, వరంగల్ పశ్చిమ అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఫిర్యాదులను ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఏ.దిలీబన్ మొబైల్ నెంబర్ 83099 21306, అలాగే వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, భూపాలపల్లి అసెంబ్లీ సెగ్మెంట్లకు ఎన్నికల వ్యయ పరిశీలకుడు ధీరజ్‌సింగా మొబైల్ నెంబర్ 8309 952057కు ఎన్నికల వ్యయ సంబంధిత అంశాలపై ఫిర్యాదు చేయవచ్చని అన్నారు.

### పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద రూ1.53లక్షలు స్వాధీనం

కాజీపేట, ఏప్రిల్ 19: కాజీపేట డీజిల్ కాలనీ పోలీస్ చెక్ పోస్టు వద్ద పోలీసుల తనిఖీలో ఓ వ్యక్తి వద్ద నగదు లభ్యమైంది. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కాజీపేట డీజిల్‌కాలనీ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా హనుమకొండ జిల్లా వేలేరు మండల కేంద్రానికి చెందిన మాడిశెట్టి శ్రీనివాస్ బైక్‌లో రూ.1,53 లక్షలు లభ్యమైనట్టు తెలిపారు. నగదుకు సంబంధించి సరైన దస్తావేజులు లేకపోవడంతో నగదు స్వాధీనం చేసుకుని ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి తెలిపారు.



కాజీపేట డీజిల్‌కాలనీ పోలీస్ చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీలు

# ఏ పత్రం ఎందుకోసమంటే..

వరంగల్ సిటీ, ఏప్రిల్ 19: రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఎన్నికల్లో ప్రక్రియలో ప్రాధాన భూమిక పోషించే ఫాం-ఎ, ఫాం-1, ఫాం-2ఏ, ఫాం-2సీ, ఫాం-26, ఫాం-బీ అంటే ఏమిటీ..? వాటి ప్రాధాన్యతను ఒక సారి పరిశీలిద్దాం.

### నోటీసు జారీ

నామినేషన్ దాఖలుకు సంబంధించి రిటర్నింగ్ అధికారి నోటీస్ (ఫాం-1) జారీ చేస్తారు. అభ్యర్థులు ఎప్పుడు, ఎక్కడ ఏ సమయంలో ఎవరికి దాఖలు చేయాలో స్పష్టంగా ప్రస్తావిస్తారు. నామినేషన్ల పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణకు సంబంధించిన వివరాలు తెలుపుతారు. వీటితో పాటు ఆయా స్థానాల్లో పోలింగ్ ఏ రోజు, ఏ సమయాల్లో జరుగుతుందో వివరిస్తారు. ఫాం-1 ఆదారంగా అభ్యర్థులు నామినేషన్లు సమర్పించాల్సి ఉంటుంది.

### లోక్‌సభ స్థానం నామినేషన్‌కు...

లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు ఫాం-2 ఏ ద్వారా నామినేషన్ దాఖలు చేయాలి. ఫాం-2ఏ ను లోక్‌సభ నామినేషన్ పత్రంగా పేర్కొంటారు. శాసనభసకు ఫాం -2బీ, రాజ్యసభకు, శాసనమండలికి ఫాం-2సీలో నామినేషన్ సమర్పిస్తారు. అభ్యర్థులకు నామినేషన్ పత్రాలను కేంద్ర ఎన్నికల సంఘమే ఉచితంగా అందిస్తుంది.

### అభ్యర్థులకు కీలకమైనవి ఇవే....

ఎన్నికలు రాగానే రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ఖరారు చేస్తాయి. అభ్యర్థుల జాబితాను ఒకసారి లేదా విడుతల వారిగా విడుదల చేస్తాయి. జాబితాలో పేరున్నంత మాత్రాన సదరు అభ్యర్థి ఆ పార్టీ తరపున ఎన్నికల్లో పోటీ చేస్తారనేది అనుమానమే. ఎందుకంటే ఏదైన ఒక రాజకీయ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థికి సదరు పార్టీ ఫాం-ఎ, ఫాం-బీ అందించాల్సి ఉంటుంది. ఆయా రాజకీయ పార్టీల అధ్యక్షుడి సంతకాలతో కూడిన ఫాం లనుఅభ్యర్థులు ఎన్నికల అధికారులకు సమర్పించాలి. అప్పుడే అభ్యర్థులు ఆయా పార్టీలతరపున పోటీలో నిలిచినట్లు పరిగనిస్తారు.




### ఎన్నికల గుర్తును నిర్ణయించేదే బీ- ఫాం..

తమ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థి వీరే అని ఆ పార్టీ ప్రతినిధి ఇచ్చేదే బీ-ఫాం. దీనిని నామినేషన్ సమయంలో ఎన్నికల అధికారులకు అందజేయాలి. నామినేషన్ల చివరి రోజు మధ్యాహ్నం 3 గంటల లోపు సమర్పించవచ్చు.సదరు పత్రంలో అభ్యర్థి పేరు, పార్టీ గుర్తు, నియోజకవర్గ వివరాలతో పాటు ఆపార్టీ అధ్యక్షుడి సంతకం ఉంటుంది. నామినేషన్‌తో పాటు అభ్యర్థి బీ- ఫాంను జత చేస్తేనే రిటర్నింగ్ అధికారి ఆ పార్టీ గుర్తును కేటాయిస్తారు. అభ్యర్థి సమర్పించిన ఫాం-ఏ, ఫాం-బీ.ఈ రెండింటిని పరిశీలించి అభ్యర్థి సదరు పార్టీ తరుపున పోటీ చేస్తున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటిస్తుంది.

### ఫా -ఏ అంటే...

రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల పేర్లను ఫాం-ఏలో తెలియజేస్తాయి. వీటిపై ఆయ రాజకీయ పార్టీలు అధ్యక్షులు లేదా ప్రధాన కార్యదర్శి సంతకంతో పాటు ముద్ర ఉంటుంది. పార్టీ ఏ వ్యక్తిని తమ ప్రతినిధిగా ఎంపిక చేస్తుందో అతడు/ఆమెకు ఇచ్చేది ఫాం-ఏ. సదరు అభ్యర్థులు ముందుగా ఫాం-ఏను సంబంధిత ఎన్నికల అధికారులకు సమర్పించాలి. ఇందులో పార్టీ పేరు, పార్టీ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులందరి పేర్లు, ఎవరు ఎక్కడి నుంచి బరిలో నిలుస్తున్నారనే వివరాలు ఉంటాయి.

### అఫిడవిట్‌కు అంతే ప్రాధాన్యం..

నామినేషన్ దాఖలుతో పాటు ఫాం-26(అఫిడవిట్) సైతం అభ్యర్థులు విదిగా సమర్పించాలి. ఫాం-26 అంటే.. అభ్యర్థులు తమతో పాటు తమ కుటుంబ సభ్యుల ఆస్తులు, అప్పులు, క్రిమినల్ కేసులు, న్యాయ స్థానాల్లో విచారణలో ఉన్న కేసుల వివరాలు పొందుపరుచాల్సి ఉంటుంది.



## కిరణ్‌కుమార్‌ను అభినందించిన సీఐ

గీసుగొండ, ఏప్రిల్ 19: యూపీఎస్సీ పరీక్షలో 568 ర్యాంకు సాధించిన అనంతారం గ్రామానికి చెందిన సయింపు కిరణ్‌కుమార్‌ను గీసుగొండ సీఐ పవన్‌కుమార్, ఎస్ఐ వెంకన్న శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మండలంలో మొదటి సారిగా ఓ చిన్న గ్రామంలో వ్యవసాయ కుటుంబం నుంచి సివిల్ సర్వీస్ ర్యాంకును సాధించిన కిరణ్‌కుమార్‌ను అతని తల్లిదండ్రులను సీఐ అభినందించారు. కిరణ్‌కుమార్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు.



గౌస్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

## ఎంసీపీఐ(యు) నేత గౌస్‌కు నివాళి

గిర్మాజిపేట,ఏప్రిల్19 : ఎంసీపీఐ(యు) జాతీయ మాజీ కార్యదర్శి మహ్మద్ గౌస్‌కు శుక్రవారం ఆ పార్టీ నివాళులర్పించింది. వరంగల్ అండర్‌బ్రిడ్జి సమీపంలోని ఓంకార్ భవన్‌లో ఎంసీపీఐ(యు) నగర కార్యదర్శి జగదీశ్వర్ అధ్యక్షతన గౌస్ తృతీయ వర్ధంతిని పార్టీ కేంద్రకమిటీ సభ్యులు గోనే కుమారస్వామి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గౌస్ చిత్రపటానికి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నర్రప్రతాప్, నాయకులు మంద రవి, బాబురావు, కుమారస్వామి, ఇస్మాయిల్, నగేష్, గణేష్, రమేష్, ప్రభాకర్, నర్సయ్య, భిక్షపతి, రాజన్న, జ్యోతి, ప్రేమలత, సుధీర్, లతీఫ్, ఇందు తదితరులు పాల్గొన్నారు.

## 'కావ్య గెలుపునకు కృషి చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న కొమురారెడ్డి

గీసుగొండ, ఏప్రిల్ 19: వరంగల్ కాంగ్రెస్ పార్లమెంటు అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామపార్టీ అధ్యక్షుల సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్ అధ్యక్షతన కొనాయమాకులలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా ఉన్న కార్యకర్తలను అధిష్ఠానం తప్పకుండా గుర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమగాని సౌజన్య, నాయకులు వజ్ర రాజు, కూసం రమేష్, దూలం వెంకటేశ్వర్లు, ఆకుల రుద్రప్రసాద్, రహీంపాష, పత్తిపాక రవిందర్, దౌడు ప్రవీణ్, రాజు పాల్గొన్నారు.

## నీ జాతకం బయటపెడతా : అరూరి

(5వ పేజీ తరువాయి)

అంటే.. తాను ఎవరి భూములను గుంజుకోలేదన్నారు. ఏ వ్యాపారం లేని కడియం.. ఇన్నేళ్లు రాజకీయంలో ఎలా రాణిస్తున్నాడని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో షై హోమ్ గెటెడ్ కమ్యూనిటీలో ఫ్లాట్స్ హనుమకొండలో ఇంద్రభవనం లాంటి ఇల్లు ఎలా నిర్మించావో తెలపాలన్నారు. రూ.60వేలకు వర్ధన్నపేటలో ఔట్‌సోర్సింగ్ వైద్యురాలిగా పనిచేసిన కావ్య.. ఇన్నోవా వెహికల్, డ్రైవర్, పీఏను ఎలా కేటాయించుకుందో బహిరంగంగా చెప్పాలని అరూరి పేర్కొన్నారు. తన ఆస్తులను 2009 ఎన్నికల ఆఫిడవిట్‌లోనే పొందపర్చానని, తనకు అవి ఎలా వచ్చాయో విచారణ చేసుకోవచ్చన్నారు. ఎన్నికల్లో లబ్ధికో సంబద్‌నామ్ చేసేందుకు తన పై కుట్రలు చేస్తున్నాడని, ప్రజలు గమనించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే తరహాలో వెన్ను పోటు పొడిచాడని అరూరి ఆరోపించారు. మాదిగ జాతిలో ఎవరైనా ఎదిగితే కడియం ఓర్వలేడని ఆరోపించారు. సమావేశంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు పద్మ, రవికుమార్, మురళీధర్, ప్రదీప్‌రావు, సంతోష్‌రెడ్డి, మహిళా మోర్చా నాయకులు సుగుణారెడ్డి, కవిత, పద్మ, శైలజా తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ డెలివరీ బాయ్‌ల చేతివాటం



**గ్యాస్ సిలిండర్‌కు అదనంగా రూ.30 నుంచి రూ.50 వరకు వసూలు**

**వినియోగదారుల జేబులు చిల్లు**

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 19: అసలే గ్యాస్ ధరలు పెరుగుతుంటే.. కొందరు డెలివరీ బాయ్‌లు అదనపు డబ్బులు వసూలు చేయడంపై సామాన్యులు మండిపడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేంద్రం సిలిండర్‌పై రూ.100 తగ్గించడంతో, రూ.874 చేరింది. ఈ క్రమంలో సిలిండర్ డెలివరీ బాయ్స్‌లు చేతివాటంప్రదర్శిస్తుండడంతో వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సిలిండర్ ఇంట్లోకి తేవాలంటే కచ్చితంగా రూ.30 నుంచి రూ.50 అదనంగా వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. ఈ విషయం గ్యాస్ సరఫరాదారులకు చెప్పినా పట్టించుకోవడం లేదంటున్నారు.వినియోగదారులకు ఉచితంగా డోర్ డెలివరీ చేయాలని నిబంధనలు ఉన్నా అది ఎక్కడా అమలు కావడం లేదు. ఒకవేళ అదనంగా డబ్బులు ఇవ్వకుంటే ఏదోసాకు చెప్పి డెలివరీలో ఆలస్యం చేస్తుంటారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. వరంగల్ మునిసిపల్ పరిధిలో ఎల్‌పీజీ సిలిండర్ సరఫరాను 5కిలోమీటర్ల పరిధిలో ఉచితంగానే డోర్ డెలివరీ చేయాల్సి ఉంటుంది. సిలిండర్ ధర మినహా ఎలాంటి అదనపు చార్జీలు వసూలు చేయరాదు. ఒకవేళ సరఫరాదారు నుంచి30కిలోమీటర్ల దూరంలో ఉంటే రూ.10 అదనంగా చార్జీ వసూలు చేయవచ్చు. అంతకుమించి దూరంలో ఉంటే రూ.15 వరకు వసూలు చేస్తారు. మరోవైపు సిలిండర్ డెలివరీ సమయంలో కచ్చితంగా తూకం వేసి వినియోగదారులకు అందించాలి కానీ చాలా మందికి అవగాహన లేకపోవడంతో వారు అడిగినంతా ఇచ్చి తూకాన్ని పట్టించుకోవడం లేదు. వరంగల్ జిల్లాలో 15గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. మొత్తం 400,289 గ్యాస్ కనెక్షన్లు ఉండగా ఇందులో సింగిల్ సిలిండర్లు 265,132, డబుల్ సిలిండర్లు 135,157, సీఎస్ఆర్ 18,280, దీపం పథకం కింద 62,862, ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు 46,195 ఉన్నాయి.

### రూ.30 నుంచి రూ.50 వసూలు

గ్యాస్ సిలిండర్ ధర కంటే అదనంగా రూ.30నుంచి రూ.50వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్యాస్ ధర రూ.874ఉంటే రూ.900 నుంచి రూ.920 వరకు వసూలు చేస్తున్నారు. మొదటి అంతస్తులో గ్యాస్ సిలిండర్ వేయాలంటే కచ్చితంగా అదనంగా డబ్బులు చెల్లించాల్సిందే. అయితే ఇలా వసూలు చేసిన మొత్తం ఎవరి ఖాతాలోకి వెళతుందే తెలియడం లేదు. సరఫరాదారుల పాత్రపై వినియోగదారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇలా అదనంగా డబ్బులు వసూలు చేస్తుండటంతో వినియోగదారుల జేబులు చిల్లు తప్పడం లేదు.



### పట్టించుకోని అధికారులు

పౌరసరఫరాల శాఖనిబంధనల ప్రకారం హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ లాంటి వ్యాపారులు కమర్షియల్ సిలిండర్లు వినియోగించాల్సి ఉంటుంది. కమర్షియ ల్ సిలిండర్ ధర ఎక్కువగా ఉండటంతో గృహ అవస రాలకు వినియోగించే సిలిండర్లను అక్రమంగా కొందరు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చాలా ప్రాంతాల్లో టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంట ర్లలో రాయితీ సిలిండర్లు వినియోగిస్తున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

### అదనంగా వసూలు చేయొద్దు..



వంటగ్యాస్ సిలిండర్ డోర్ డెలివరీ పేరిట నిబంధనలకు విరుద్ధంగా అదనంగా డబ్బులు వసూలు చేయరాదు. డోర్ డెలివరీ పేరిట అదనపు వసూళ్లకు పాల్పడినట్లు మా దృష్టికి వస్తే సంబంధిత గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే సరఫరా చేయాలి. రాయితీ గ్యాస్ సిలిండర్లను నిబంధనలకు విరుద్ధంగా హోటళ్లు, రెస్టారెంట్లు ఇతర వ్యాపారు లకు సరఫరా చేయడం చట్టప్ర కారం నేరం.

**- శివప్రసాద్‌రెడ్డి, వరంగల్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి**

### డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయండి..



వినియోగదారులకు సిలిండర్ డోర్ డెలివరీ ఉచితంగానే చేయాలి. అదనంగా డబ్బులు వసూలు చేస్తే సంబంధిత గ్యాస్ ఏజెన్సీలకు గానీ, పౌరసరఫరాల అధికారులకు గానీ ఫిర్యాదు చేయాలి. వారు స్పందించకుంటే వినియోగదారుల ఫోరంకు ఆశ్రయించొచ్చు. సెల్‌నెంబరు 98493 46491కు ఫిర్యాదు చేస్తే, వినియోగదారుల ఫోరం తరుపున చర్యలు తీసుకుంటాం.

**- డాక్టర్ పల్లెపాడు దామోదర్, దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు**

## ఘనంగా చిన్న రథోత్సవం

కరీమాబాద్, ఏప్రిల్ 19: రంగశాయిపేటలోని శ్రీసీతారామచంద్రస్వామి చిన్న రథోత్సవం శుక్రవారం కన్నులపండువగా సాగింది. ప్రధాన అర్చకులు తిరుమల శ్రీధరాచార్యుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉదయం బ్రాహ్మణ సభాసత్కారాలు, మహాదాశీర్వచనాలు నిర్వహించారు. రాత్రి 7.30 నిమిషాలకు ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం హనుమాన్ లక్ష్మణ సహితంగా శ్రీసీతారాములను గరుడ వాహన సహిత చిన్నరథంపై ఊరేగించారు. రథం ఊరేగింపు రంగశాయిపేటలోని భవానీ శంకరదేవాలయం, హనుమాన్ దేవాలయం, గాంధీ విగ్రహం, పోచమ్మగుడి, బొడ్రాయి సెంటర్ మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. మహిళలు భక్తిశ్రద్ధలతో రథానికి మంగళహారతులతో స్వాగతం పలికారు. జై శ్రీరామ్ నినాదాలతో రంగశాయిపేట వీధులు మార్మోగాయి. టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్తు శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వేడుకలో ఆలయ ఫౌండర్ ట్రస్టు చైర్మన్ పులిగిళ్ల వెంకటరామనర్సింహ శాస్త్రి, ఉత్సవ నిర్వహణ కమిటీ బాధ్యులు వలుపదాసు కృష్ణ, బొలుగొడ్డు అనిల్, విలాసాగరం శ్రీనివాస్ (చిన్నా), వద్దిరాజు ప్రశాంత్, పాలకుర్తి రవళి సుమన్, బొల్లెపెల్లి సరిత, అనిల్, అనిల్, శిరీష్, పాల్గొన్నారు.



చిన్న రథంపై సీతారాములు ఊరేగింపు

## పూజారి ఆత్మహత్య



ఓం ప్రకాష్(ఫైల్)

వరంగల్‌సిటీ, ఏప్రిల్ 19: ఆర్థిక ఇబ్బందులతో పూజారి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున ఏనుమాముల సమీపంలోని ఎస్ఆర్ నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం మార్త ఓం ప్రకాష్(38) కొంతకాలం కాశిబుగ్గలోని శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో పూజారిగా పనిచేశాడు. మూడేళ్ల నుంచి మొగిలిచర్లలోని శివాలయంలో పూజారిగా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య వాణి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పూజారిగా వచ్చే ఆదాయం సరిపోక కుటుంబ పోషణ కోసం ప్రకాష్ అప్పులు చేశాడు. ఇటీవల అప్పులిచ్చిన వాళ్లు డబ్బులు అడుగుతుండడంతో మనస్తాపానికి గురయ్యాడు. గురువారం రాత్రి భార్య, పిల్లలు భోజనం చేసి పడుకోగా, ప్రకాష్ అర్ధరాత్రిపై అంతస్థులోకి వెళ్లి ఉరి వేసుకున్నాడు. తెల్లవారుజామున కుటుంబ సభ్యులు లేచి చూస్తే ప్రకాష్ కనిపించకపోవడంతోపై అంతస్థుకు వెళ్లి చూడగా, ఉరి వేసుకుని కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించి, చికిత్స కోసం ఎంజీఎంకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. ఏనుమాముల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఓం ప్రకాష్ మృతితో కాశిబుగ్గ, మొగిలిచర్ల, ఎస్ఆర్ నగర్ కాలనీలో విషాదం నెలకొంది.

## అగ్ని ప్రమాదాలపై అవగాహన



జకోరియా కాంప్లెక్స్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

మట్టెవాడ, ఏప్రిల్ 19: అగ్ని ప్రమాదాలను నివారించేందు కు వాణిజ్య సముదాయాల షాపుల యజమానులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వరంగల్ ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ బి.రవీందర్ అన్నా రు. శుక్రవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా వరంగ ల్ పోచమ్మమైదాన్‌లోని జకోరియా కాంప్లెక్స్‌లోని షాపుల యజమానులకు, సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే కరప త్రాల ద్వారా అవగాహన కల్పిం చారు. కార్యక్రమంలో అగ్ని మాపక సిబ్బంది బి. రవీందర్, ఎం.గణేష్, కె.రవి, బి.గిరిబాబు, ఎండి నబీ తదితరులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణ సంఘం విదేశీ విహార యాత్ర



విహార యాత్ర బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న పాలక వర్గం

కరీమాబాద్, ఏప్రిల్ 19: ఫోర్ట్‌రోడ్స్‌లోని అన్నపూర్ణ పరపతి సంఘం ఆధ్వర్యంలో విదేశీ విహార యాత్రకు ఏర్పాట్లు చేసినట్లు సంఘం అధ్యక్షుడు బిట్ల సుధాకర్ తెలిపారు. శుక్రవారం 39వ డివిజన్‌లోని అన్నపూర్ణ పరపతి సంఘం కల్యాణ మండపం భవనంలో పాలకవర్గ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి యాత్ర వివరాలను వెల్లడించారు. సభ్యులు కుటుంబ సమేతంగా ఆరు రోజులపాటు బ్యాంకాక్, థాయిలాండ్ (ఆధ్యాత్మిక) విదేశీ యాత్రలకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 272 మంది 23, 26 తేదీల్లో రెండు బృందాలుగా శంషాబాద్ విమానాశ్రాయానికి చేరుకొని రెండు విమానాల్లో బ్యాంకాక్‌కు బయలుదేరడం జరుగుతుందన్నారు. 28,29న, మే2న వరంగల్‌కు చేరుకుంటారని తెలిపారు. సమావేశంలో పరపతి సంఘం పాలకవర్గం ఉపాధ్యక్షులు రాజమల్లు, ప్రధాన కార్యదర్శి కోటేశ్వర్‌రావు, కోశాధికారి సాంబయ్య, శ్రీధర్, నర్సయ్య సారయ్య, కొండల్‌రావు, దామోదర్ యాదవ్, రఘువీర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సలహాదారును కలిసిన లారీ అసోసియేషన్ ప్రతినిధులు



వరంగల్ సిటీ, ఏప్రిల్ 19: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని ఆయన స్వగ్రామం అర్పనపల్లిలో శుక్రవారం తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. లారీ ఫిట్నెస్ ఫీజు రూ.1000 ఉన్న దానికి రూ.13,700లుగా పెంచారని, ఆ విషయంలో కోర్టు స్టే ఇచ్చినా, అధికారులు అమలు చేయడం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇసుక క్వారీలలో లోడింగ్ సమయాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను వెల్లడిం చారు. స్పందించిన నరేందర్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలం గాణ స్టేట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మంచిరెడ్డి రాజేందర్‌రెడ్డి, వరంగల్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల భూపాల్, జిల్లా కోశాధికారి ఎండి. జాకీర్, నారాయణ పాల్గొన్నారు.

## బీజేపీ ఇంటింటి ప్రచారం

మిల్స్‌కాలనీ, ఏప్రిల్ 19: ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నందున కేంద్రంలో మళ్లీ నరేంద్ర మోదీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని బీజేపీ జోనల్ ఇన్‌చార్జి మంద శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు ముత్తినేని శ్రీనివాస్ అన్నారు. జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆదేశాల మేరకు 33వ డివిజన్‌లోని 19వ బూత్‌లో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మోదీ ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ పరిపాలన చేస్తున్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను గెలిపించి వరంగల్ అభివృద్ధికి బాటలు వేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి జిలకర వీరస్వామి, శక్తికేంద్రం ఇంచార్జీ తిప్పని రమేష్, నాయకులు సూరం జనార్దన్, నాగుల ప్రసాద్, బోడకాri ఓదెలు పాల్గొన్నారు.



## వాహనాల దొంగ అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ

వరంగల్‌చౌరస్తా, ఏప్రిల్ 19: మద్యానికి బానిసై, జల్సాలకు అలవాటుపడి దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ తెలిపారు. శుక్రవారం ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరుకు చెందిన షేక్ ఇమ్రాన్ మద్యానికి బానిసై ఎలాంటి పనులు చేయకపోవడంతో భార్యా పిల్లలు అతన్ని వదిలిపెట్టి పుట్టింటికి వెళ్లారన్నారు. గత ఏడాది నిందితుడు వరంగల్‌లోని కాశిబుగ్గకు వచ్చి నివాసం ఉంటూ గత నవంబరులో గిర్మాజీపేటలో ఓఇంటి ముందుపార్కు చేసి ఉన్న పల్సర్ బైక్‌ను దొంగిలించాడన్నారు. అలాగే జనవరి 2వ వారంలో స్టేషన్ రోడ్డు పోచమ్మగుడి వద్ద పార్కింగ్ చేసిన ఆటోను, ఫిబ్రవరి 2వ వారంలో లక్ష్మి వైన్స్‌షాపు ముందు బైక్‌ను, లక్ష్మిపురంలో కిరాణం షాపు ముందు బైక్‌ను దొంగతనం చేసినట్టు వెల్లడించారు. అలాగే రైల్వే స్టేషన్‌వద్ద స్టాండ్‌లో వాహనాలను దాచిపెట్టి అందులో ఒక మోటారు సైకిల్‌ను మల్లూరు గ్రామంలో విక్రయించి డబ్బులు తీసుకొని వస్తామని వెళ్తుండగా పోలీసులు బస్టాండ్ ఏరియాలో వాహనాలు తనిఖీ చేస్తూ నిందితుడిని చాకచక్యంగా పట్టుకొని వాహనాలను, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన వాహనాల విలువ రూ.2లక్షల వరకు ఉంటుందన్నారు. సమావేశంలో ఇంతేజార్‌గంజ్ సీఐ మచ్చ శివకుమార్, ఎస్సై బి.వెంకన్న, కానిస్టేబుళ్లు రవీందర్‌రెడ్డి, భిక్షపతి, శివకుమార్, ఉపేందర్, రాజశేఖర్‌లు పాల్గొన్నారు.

## కేసు వాపస్ తీసుకోలేదని దాడి

మట్టెవాడ, ఏప్రిల్ 19: కేసును వాపస్ తీసుకోకపోవడంతో పగను పెంచుకుని రామన్నపేటకు చెందిన ఉప్పుల సాయి పాకాల కిరణ్‌పై గురువారం రాత్రి కత్తి దాడి చేసినట్లు మట్టెవాడ పోలీసులు తెలిపారు. మట్టెవాడ సీఐ తుమ్మ గోపీ కథనం ప్రకారం.. రామన్నపేటకు చెందిన ఉప్పుల సాయి గురువారం పాకాల కిరణ్-వర్షిత దంపతులు కొత్తవాడ ప్రాంతం నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా సాయి కిరణ్‌పై కత్తితో దాడి చేసి గాయపరిచాడు. సంఘటనపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాధితుడు కిరణ్‌ను ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. సాయిపై మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో గతంలో కేసు నమోదైంది. ప్రస్తుతం నిందితుడు సాయి పరారీలో ఉన్నట్లు తెలిసింది. కత్తితో దాడి ఘటనపై సాయిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం కిరణ్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడు.

## గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణ

**కోడ్ అమల్లో ఉన్నా బేఖాతరు**

సంగెం, ఏప్రిల్ 19 : జిల్లాలో కోడ్ అమలులో ఉన్నా.. గ్రామాల్లో మాత్రం యథేచ్ఛగా బెల్ట్‌షాపులు కొనసాగుతున్నాయి. ఏ రాత్రి తలుపు తట్టిన కావాల్సిన బ్రాండ్లు లభిస్తున్నాయి. బెల్టు షాపులపై దృష్టి పెట్టాల్సిన సంబంధిత ఎక్సైజ్ అధికారులు వాటిని కన్నెత్తి కూడా చూడడం లేదనే విమర్శలున్నాయి. ఎన్నికల కోడ్ బేఖాతరు చేసినా అధికారులకు మాత్రం పట్టడం లేదు. గ్రామంలో ఎవరు మద్యం అమ్ముతున్నారో వారి పేర్లు, ఫోన్ నెంబర్లతో సహ పూర్తి డాటా ఉన్నప్పటికీ వారిని నిలువరించడంలో విఫలమవుతున్నారు. జిల్లాలో 63మద్యం దుకాణాలు ఉన్నాయి. వర్ధన్నపేట, పరకాల, నర్సంపేట సర్కిల్ల వారిగా సీఐలు ఇక్కడి షాపులను చూసుకుంటున్నారు. ఇక్కడి ఏరియాల్లో అక్రమంగా మద్యం అమ్మితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. 2, 3 నెలలకోసారి ఏదో గ్రామంలో దాడులు చేసిన ఒకరిద్దరిని అరెస్టు చేసి చేతులు దులుపుఉంటున్నారనే విమర్శలున్నాయి. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నా ఇష్టానుసారంగా మద్యం విక్రయాలు జరపడానికి వీలుండదు. వైన్స్ షాపు యజమానులు ఇష్టానుసారంగా మద్యాన్ని అమ్మేస్తున్నారు. ఒక్కో వ్యక్తికి ఇవ్వాల్సిన పరిమిత బాటిళ్ల సంఖ్యను దాటి అందిస్తున్నారు. దీనికి తోడు గ్రామాల్లో పూర్తిగా బెల్టు షాపులు నడవకుండా జాగ్రత్తలు చేపట్టాల్సిన అధికారులు ఆ దిశగా దాడులు చేయడం లేదు. ఈనెలలోనే దాదాపు జిల్లాలోని 5 చోట్ల దాడులు చేసి అక్రమ మద్యాన్ని బెల్టు షాపుల ఇండ్లలో పట్టుకుని కేసులు నమోదు చేశారు. దీంతో ఎక్సైజ్ శాఖ అధికారుల తీరు ఎలా ఉందో అర్థమవుతోంది. మరోపక్క సివిల్ పోలీసులు సైతం కొన్ని చోట్ల దాడులు చేస్తూ పట్టుబడిన వారిని బైండోవర్ చేస్తున్నారు.

### బెల్టు షాపులు నడిస్తేనే మామూళ్లు ..

జిల్లాలోని ఎక్సైజ్ శాఖ అధికారులు మద్యం వ్యాపారులు అల్టిమేటం జారీ చేశారని ప్రచారం సాగుతోంది. గ్రామాల్లో బెల్టు షాపులు నడిస్తేనే నెలవారి మామూళ్లు ఇస్తామని తెగేసి చెప్పిట్టు చెబుతున్నారు. దీంతో చేసేదేమి లేక బెల్టు షాపులపై దాడులు చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి నెల ఒక్కో షాపు నుంచి ఆ ఏరియా రూ. 30 వేల నుంచి రూ.40 వేల వరకు ఇస్తేనే బెల్టు షాపులకు వేసే మద్యంపై అధిక ధరలకు అనుమతిస్తారు.



## వెంకటాపురంలో కంఠమహేశ్వరస్వామి ఉత్సవాలు

దుగ్గొండి, ఏప్రిల్ 19 : మండలంలోని వెంకటాపురంలో శుక్రవారం గౌడ కులస్తులు కంఠమహేశ్వరస్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గౌడ కులస్తులు నూతన తెల్ల వస్త్రాలు ధరించి కొత్త బిందలు ఎత్తుకొని గౌడ పూజారులైన రమేశ్, లక్ష్మణ్‌లు డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా దేవాలయం వరకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు మంగళ హారతులతో పెద్ద సంఖ్యలో తరలి వెళ్లి జలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ జన హక్కుల సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంతుల రమేశ్ గౌడ్ పోగాకు కృష్ణమూర్తిగౌడ్, కక్కెర్ల సాంబయ్యగౌడ్, బొమ్మగాని సదానందం, సదయ్యగౌడ్, పోగాకు వెంకన్న, గుండెబోయిన సుధాకర్, సాంబయ్యగౌడ్, ముత్యాల వెంకన్న, గడ్డమీది శివశంకర్, వెంకట్‌గౌడ్, పంజాల వెంకట్‌గౌడ్, పోగాకు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ కల్యాణ మండపం ప్రారంభం


కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న దాతలు

పర్వతగిరి, ఏప్రిల్ 19 : మండలంలోని ఏనుగల్లులో సోమేశ్వర ఆలయానికి అనుబంధంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని శుక్రవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన చెర్విరాల సోమనర్సయ్య - చంద్రకళ దంపతులు వారి తల్లిదండ్రులు సత్తయ్య-రత్తమ్మ జ్ఞాపకార్థం రూ.20 లక్షలతో నిర్మించారు. గ్రామానికి చెందిన హనుమాన్ మాలధారులకు మాలధారణ అనంతరం విడిది చేయడానికి సౌకర్యవంతమైన భవనం లేకపోవడంతో వారి అభ్యర్థన మేరకు సోమేశ్వర ఆలయం పక్కన కల్యాణ మండపాన్ని నిర్మించారు. మాలధారులతో పాటు గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబాల వారు వివాహాలకు ఉపయోగపడేలా నిర్మించినట్లు దాత సోమనర్సయ్య తెలిపారు.గత ఆరేళ్లుగా గ్రామంలో సోమేశ్వర ఆలయ నిర్మాణం, ధనిమెట్టు ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపనతోపాటు పలు కార్యక్రమాలను చేపడుతున్నందున గ్రామ ప్రముఖులు తక్కళ్లపెల్లి నారాయణరావు, భాస్కర్‌రావు, బొంపెల్లి దేవేందర్‌రావు, హనుమాన్ మాలధారులు వారిని అభినందించి శాలువాలతో సన్మానం చేశారు.

## దేశంలో మోదీ ప్రభంజనం వీస్తోంది : సీతారాంనాయక్


మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్

నర్సంపేట, ఏప్రిల్ 19 : దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభంజనం వీస్తుందని మహబూబాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్ అన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం, మళ్లీ ప్రధానిగా నరేంద్ర మోదీ కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నర్సంపేట నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీ అందించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలను ఆయన కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శీలం రాంబాబు, బోడగొల్లానాయక్, గూడూరు సందీప్, కూలమల్లపృధ్వీరాజ్, ఠాకూర్ రవీందర్‌సింగ్‌తో పాటు బూత్‌కమిటీ అధ్యక్షులు, పట్టణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## 'అరూరి రమేష్ గెలుపు తథ్యం'

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 19 : వరంగల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ గెలుపు తథ్యమని వర్ధన్నపేట బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు రాయపురపు కుమారస్వామి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని కట్ర్యాల, కడారిగూడెం గ్రామాల్లో బూత్ కమిటీల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో అరూరి రమేష్ గెలుపు కోసం బూత్ స్థాయి కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి బీజేపీ పథకాలను వివరించాలన్నారు. అనంతరం కట్ర్యాల గ్రామంలోని ఇతర పార్టీలకు చెందిన ఎండీ యాకూబ్ బాషా, సఫియా, సాతుపల్లి బాబు, తాటికాయల కృష్ణలను పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గాడిపెల్లి రాజేశ్వర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు నాంపెల్లి యాకయ్య, నాయకులు ఇల్లందు సుదర్శన్, ఓబీసీ రాష్ట్ర మోర్చా నాయకుడు జడ సతీష్, సోషల్ మీడియా కో కన్వీనర్ కుందూరు మహేందర్‌రెడ్డి, గుడ్ల సుభాష్, తాళ్లపెల్లికృష్ణమూర్తి, పెద్దూరి రాజ్ కుమార్, సంపత్‌రెడ్డి, సోమిరెడ్డి పాల్గొన్నారు. అలాగే వర్ధన్నపేట పట్టణంలోని మూడో వార్డులో కౌన్సిలర్ కొండేటి అనిత సత్యం ఆధ్వర్యంలో బీజేపీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు గిరిప్రసాద్, సోషల్ మీడియా ఇన్‌చార్జి విక్కీ, దినేష్, వేణు, గణేష్, అశోక్, శ్రీనివాస్, నజీర్, అఖిల్, బాబు తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజలు మోదీ పాలనను కోరుకుంటున్నారు'

నెక్కొండ , ఏప్రిల్ 19 : భారతదేశ ప్రజలు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాలనను కోరుకుంటున్నారని నర్సంపేట నియోజకవర్గం నాయకులు డాక్టర్ పుల్లారావు, నెక్కొండ మండల బీజేపీ అధ్యక్షుడు సొంటిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డిలు అన్నారు. పెద్దకొర్పోలులో వివిధ పార్టీలకు చెందిన నాయకులు దయ్యాల రాంచంద్రు, వెంకన్న, విజయలక్ష్మి, అనిల్, స్వామి, వీరు తదితరులు శుక్రవారం బీజేపీలో చేరగా వారికి పార్టీ కండువాలను కప్పి పార్టీలో చేర్చుకున్నారు. మహబూబాబాద్ ఎంపీగా సీతారాంనాయక్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింట ప్రచారం చేపట్టారు.

# కొనుగోళ్లకు తాలు గండం

### అదనపు ఖర్చంటూ రైతుల గగ్గోలు

### ధాన్యం కొనుగోళ్లలో స్తంభన

పర్వతగిరి, ఏప్రిల్ 19 : ధాన్యం కొనుగోళ్లకు 'తాలు' గండం నెలకొంటోంది. ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీక్లీనర్‌తో ధాన్యాన్ని శుద్ధి చేస్తేనే కొనుగోళ్లు చేపట్టాలని అధికారులు నిర్వాహకులకు సూచించడంతో కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. తేమశాతం 17వచ్చినా అందులో తాలు, మట్టిపెడ్డలు ఉంటున్నాయని, ఖచ్చితంగా మిషన్‌లో తూర్పార పడితేనే కొనుగోళ్లు చేపట్టాలని ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉండడంతో క్లీనింగ్ చేయని రైతులకు వ్యవసాయ విస్తరణ అధికారులు టోకెన్‌లు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. ప్యాడీక్లీనర్‌తో శుద్ధి చేయాలంటే కనీసం నలుగురు కూలీల అవసరం ఉంటుందని, దిగుబడిని బట్టి ఒక్కో రైతుకు నాలుగైదు రోజుల పాటు కేటాయించాలని తమకు ఇది అదనపు ఖర్చవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### జిల్లాలో 207 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

జిల్లా వ్యాప్తంగా ఇప్పుడిప్పుడే వరి కోతలు ప్రారంభం కాగా, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చి చేరుతోంది. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత యాసంగిలో 1.12,050 ఎకరాల్లో వరి సాగు చేయగా, 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించే లక్ష్యంతో ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా, ఎఫ్‌పీసీఎల్‌ల ఆధ్వర్యంలో 207 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొన్ని ఇప్పటికే ప్రారంభం కాగా, మిగతావి సైతం రెండు, మూడు రోజుల్లో ప్రారంభం కానున్నాయి. కొనుగోలు కేంద్రాలకు ఇప్పుడిప్పుడే వరిధాన్యం వచ్చి చేరుతోంది.

### ప్యాడీక్లీనర్‌తో శుద్ధి చేస్తేనే కొనుగోలు

కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని కేంద్రాల్లో ఉన్న ప్యాడీక్లీనర్ (తాలు శుద్ధిచేసే యంత్రం)తో తూర్పార పట్టిన తరువాతే కొనుగోలు చేపట్టాలని అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయా కొనుగోలు కేంద్రాల్లో వ్యవసాయ విస్తరణాధికారులు క్లీనర్‌లో శుద్ధి చేసిన ధాన్యానికే టోకెన్‌లు జారీచేస్తామని ఖరాఖండిగా చెబుతున్నారు. ప్యాడీక్లీనర్‌తో ధాన్యాన్ని తూర్పారపట్టాలంటే కనీసం నలుగురు కూలీల అవసరం ఉంటుందని, ఒక్కో రైతుకు వారి ధాన్యం దిగుబడిని బట్టి రెండు నుంచి మూడు రోజుల పాటు తమ ధాన్యాన్ని తూర్పారపట్టాల్సి వస్తుందని అంటున్నారు. దీంతో కూలీల ఖర్చుతో పాటు ప్రస్తుతం మాడు పగిలే ఎండలలో తూర్పారపట్టడం అదనపు ప్రయాస అవుతుందని వాపోతున్నారు. దీనికితోడు వరికోత మిషన్‌లో కన్నా ప్యాడీక్లీనర్‌లో తూర్పారపడితే ఎక్కువగా తాలువస్తుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే వరికి రోగాలకు తోడు నీటి ఎద్దడితో దిగుబడి తగ్గిందని ఒకవైపు ఆందోళన చెందుతుంటే మరోవైపు ప్యాడీక్లీనర్ లింకేంటని వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో కన్నా బయట దళారులకు ధాన్యాన్ని విక్రయించడమే ఉత్తమమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కొనుగోలు కేంద్రంలో ఏర్పాటుచేసిన ప్యాడీ క్లీనర్

### దళారుల వైపు రైతుల మొగ్గు

దళారులకు ధాన్యాన్ని విక్రయించి మోసపోకూడదని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించాలని పదేపదే చెప్తుంది. దీంతో రైతులు అధికంగా కొనుగోలు కేంద్రాలకే తమ ధాన్యాన్ని తీసుకువస్తున్నారు.కాగా, కొనుగోలు కేంద్రాలకు ఐదారేళ్ల క్రితమే ప్యాడీక్లీనర్‌లను గత ప్రభుత్వం అందించింది. రైతులు వాటిని ఉపయోగించిన దాఖలాలు లేవు. తేమ, తరుగు పేరిట ఒక్కో బస్తాకు కేజీ నుంచి రెండు కేజీల మేర అధికంగా తూకం వేసి మిల్లులకు తరలించేవారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం ఖచ్చితంగా ధాన్యాన్ని మిషన్లలో తూర్పారపట్టిన తరువాతే కొనుగోలు చేపట్టాలని పేర్కొనడంతో రైతులంతా ప్రస్తుతం దళారుల వైపే మొగ్గుచూపే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### ప్రతీసారి లాగే కొనుగోళ్లు చేపట్టాలి

**సకినాల వెంకన్న, రైతు**



ప్రభుత్వం ప్రతీసారి ధాన్యం కొనుగోళ్లు చేపట్టిన మాదిరిగానే ఈసారి కూడా కొనుగోలు చేయాలి. ఎన్నోఏళ్లుగా ఉన్న పద్ధతులను కాదని ప్రస్తుత ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో కొర్రీలు పెడుతోంది. ప్రతీ రైతుకు చెందిన ధాన్యాన్ని మిషన్‌లో పోసి తూర్పారపట్టాలంటే ఎంతో ఖర్చుతో కూడుకున్న పని. తూకం కొంచెం ఎక్కువైనా ప్రతీసారిలాగానే కొనుగోలు చేయాలి.

### మంచిగా ఉన్న ధాన్యానికి కూడా కొర్రీలు

**కొమ్ము శ్రీనివాస్, రైతు**



మంచిగా ఉన్న ధాన్యాన్ని సైతం మిషన్‌లో తూర్పారపట్టాలని అధికారులు చెప్తున్నారు. అధికారులు టోకెన్‌ఇస్తేనే నిర్వాహకులు కొనుగోలు చేస్తామని చెప్తున్నారు. కేంద్రానికి వచ్చిన అందరు రైతుల ధాన్యాన్ని తూర్పారపట్టాలంటే చాలా రోజులు పడుతుంది. తాలు, తేమ లేకుండా బాగా ఉన్న ధాన్యాన్ని ఎలాంటి కొర్రీలు పెట్టకుండా కొనుగోలు చేయాలి.

## షార్ట్ సర్క్యూట్‌తో కారులో పొగలు

నల్లబెల్లి, ఏప్రిల్ 19: షార్ట్ సర్క్యూట్‌తో ఓ కారు నుంచి పొగలు వచ్చిన సంఘటన నల్లబెల్లిలో చోటుచేసుకుంది. బాధితుడు నాగులగాణి దిలీప్ కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం గూడెప్పాడ్ గ్రామానికి చెందిన నాగులగాణి దిలీప్ శుక్రవారం కారులో నల్లబెల్లి తహసీల్దార్ కార్యాలయానికి భూమి రిజిస్ట్రేషన్ పని మీద వచ్చాడు. కారును తహసీల్దార్ కార్యాలయం పక్కన నిలిపి, భూమి రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయంలోకి వెళ్లాడు. ఎండవేడికి కారులోని వైర్లు షార్ట్ సర్క్యూట్ అయి కారు నుంచి ఒక్కసారిగా పొగలు వచ్చాయి. దీంతో స్థానికుల సాయంతో కారులో నీళ్లు పోసి పొగలను ఆర్పారు. కొంత నష్టం జరిగినప్పటికీ పెద్ద ప్రమాదమేమి జరగలేదని బాధితుడు తెలిపారు.

## ఫైర్ సేఫ్టీ పై అవగాహన

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 19: పట్టణంలోని ఎస్‌వీఎస్ సినిమా థియేటర్‌లో వర్ధన్నపేట అగ్నిమాపక సిబ్బంది శుక్రవారం ఫైర్ సేఫ్టీపై అవగాహన కల్పించారు. ఫైర్ స్టేషన్ అధికారి భద్రయ్య మాట్లాడుతూ సినిమా థియేటర్‌లో ఫైర్ సేఫ్టీ పరికరాలు ఎల్లప్పుడు ఉంచుకోవాలన్నారు. తగినంత నీరు నిల్వ ఉండటం వల్ల జరగరాని అగ్ని ప్రమాదాలు సంభవిస్తే మంటలు ఆర్పేందుకు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో సైతం అవగాహన కల్పించి వాల్‌పోస్టర్లను అంటించారు.

## విద్యుత్‌కు అంతరాయం

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 19 : వర్ధన్నపేట పట్టణంలోని రెండో వార్డులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మరమత్తుల కారణంగా రెండు రోజుల పాటు విద్యుత్‌లో అంతరాయం కలుగుతుందని వర్ధన్నపేట ఏడీఈ కన్న రాజు ఒక ప్రకటనలో తెలిపారు. రెండో వార్డులో ట్రాన్స్‌ఫార్మర్ గద్దెను నిర్మించే క్రమంలో శనివారం, ఆదివారం రెండో రోజులు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ నిలిపి వేస్తామని తెలిపారు. మిగతా ఏరియాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## నీటి ఎద్దడిపై నిర్లక్ష్యం చేయరాదు

దుగ్గొండి, ఏప్రిల్ 19 : వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా కార్యదర్శులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా పంచాయతీ అధికారి కల్పన ఆదేశించారు. మండలంలోని తిమ్మంపేటను శుక్రవారం డీపీవో కల్పన సందర్శించి గ్రామ పంచాయతీ, నర్సరీలను సందర్శించి పరిశీలన చేశారు. జీపీ రికార్డులు తనిఖీ చేసిన అనంతరం గ్రామంలో నీటి ఎద్దడి పరస్థితి గ్రామ కార్యదర్శి రమేశ్‌ని అడిగి తెలుసుకున్నారు. నీటి ఎద్దడి పట్ల నిర్లక్ష్యం చేయరాదన్నారు. నీటి వనరులకు ప్రత్యామ్నాయంగా తీసుకొని నీటివసతి కల్పించాలన్నారు. డీపీవోతో పాటు ఎంపీవో శ్రీధర్‌గౌడ్, గ్రామ ప్రత్యేక అధికారి దయాకర్‌లు ఉన్నారు.

## నీ జాతకం బయటపెడతా..: అరూరి

(5వ పేజీ తరువాయి)

అంటే.. తాను ఎవరి భూములను గుంజుకోలేదన్నారు. ఏ వ్యాపారం లేని కడియం.. ఇన్నేళ్లు రాజకీయంలో ఎలా రాణిస్తున్నాడని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో షై హోమ్ గెటెడ్ కమ్యూనిటీలో ఫ్లాట్స్, హనుమకొండలో ఇంద్రభవనం లాంటి ఇల్లు ఎలా నిర్మించావో తెలపాలన్నారు. రూ.60వేలకు వర్ధన్నపేటలో ఔట్‌సోర్సింగ్ వైద్యురాలిగా పనిచేసిన కావ్య.. ఇన్నోవా వెహికల్, డ్రైవర్, పీఏను ఎలా కే టాయించుకుందో బహిరంగంగా చెప్పాలని అరూరి పేర్కొన్నారు. తన ఆస్తులను 2009 ఎన్నికల ఆఫిడవిట్‌లోనే పొందపర్చానని, తనకు అవి ఎలా వచ్చాయో విచారణ చేసుకోవచ్చన్నారు. ఎన్నికల్లో లబ్ధికోసం బద్‌నామ్ చేసేందుకు తన పై కుట్రలు చేస్తున్నాడని, ప్రజలు గమనించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే తరహాలో వెన్ను పోటు పొడిచాడని అరూరి ఆరోపించారు. మాదిగ జాతిలో ఎవరైనా ఎదిగితే కడియం ఓర్వలేడని ఆరోపించారు. సమావేశంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు పద్మ, రవికుమార్, మురళీధర్, ప్రదీప్‌రావు, సంతోష్‌రెడ్డి, మహిళా మోర్చా నాయకులు సుగుణారెడ్డి, కవిత, పద్మ, శైలజా తదితరులు పాల్గొన్నారు.

# చోరీ కేసులో నిందితుడి అరెస్టు

### అపహరించిన సొమ్మును స్వాధీనం చేసుకున్న పోలీసులు


నిందితుడిని, స్వాధీనం చేసుకున్న సొమ్మును చూపుతున్న సీఐ చంద్రమోహన్

చెన్నారావుపేట, ఏప్రిల్ 19 : మండల కేంద్రంలో చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ చంద్రమోహన్ శుక్రవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం... దుగ్గొండి మండలం చలపర్తి గ్రామానికి చెందిన కోల నర్సయ్య తన చెల్లెలైనా మాచెర్ల జమున ఇంటి వద్ద గత సంవత్సర కాలంగా ఉంటున్నాడు. ప్రతీ రోజు లారీ మీద క్లీనర్‌గా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇంటికి సమీపంలో ఉన్న మండల మల్లికాంబ ఇంట్లో నర్సయ్య ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి సమయంలో దొంగతనం చేసి, అదే రోజు రాత్రి నర్సయ్య తన సమీప బంధువులైనా మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం బ్రహ్మణపల్లికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం తిరిగి చెన్నారావుపేటకు వస్తున్న క్రమంలో కోనాపురం క్రాస్ రోడ్డు వద్ద వాహనాలను పోలీసులు తనిఖీలు చేస్తుండగా నర్సయ్య పోలీసులను చూసి పరుగెత్తె ప్రయత్నంగా చేయగా, పట్టుకొని విచారణ చేశారు. దీంతో తాను మల్లికాంబ ఇంట్లో దొంతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో, అతని వద్ద నుంచి ఒక తులం బంగారు కమ్మలు, పుస్తెలతో పాటు 30 తులాల వెండి, 50 కిలోల బియ్యం బస్తాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందుతుడిని అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించామని సీఐ వివరించారు. నిందితుడి సమాచారం సేకరించిన టెక్నికల్ ఐడియా అసిస్టెంట్ సల్మాన్ పాషా, కానిస్టేబుల్ సురేష్, నరేష్‌లను సీఐ, ఎస్సైలు ప్రత్యేకంగా అభినందిచారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గూడ అరుణ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆటో పైనుంచి పడి కార్మికురాలికి గాయాలు

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 19 : వర్ధన్నపేట మునిసిపాలిటీ పరిధిలోని రెండో వార్డులో ఆటో పైనుంచి పడి సఫాయి కార్మికురాలికి గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చెత్తను తరలించే ఆటోలో వెనుక భాగంలో డోర్‌పై కూర్చున్న సఫాయి కార్మికురాలు ఆటో ప్రయాణిస్తుండగా డోర్ ఊడిపోవడంతో కింద పడిపోయింది. దీంతో ఆమెకు నడుము భాగంగా బలమైన గాయం కావడంతో తోటి కార్మికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కాంగ్రెస్ ఎస్సీ సెల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా చంద్రమౌళి



వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 19 : వర్ధన్నపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా మండలంలోని అంబేద్కర్‌నగర్ గ్రామానికి చెందిన జనగాం చంద్రమౌళిని నియమించినట్లు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ తన పై నమ్మకంతో పార్టీ బాధ్యతలు అప్పగించిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్ రావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

## నిరంతర విద్యుత్‌ను అందించడమే లక్ష్యం

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 19 : పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు సైతం నాణ్యమైన, నిరంతర విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా విద్యుత్ సిబ్బంది పనిచేయాలని వరంగల్ సర్కిల్ విద్యుత్ శాఖ డీఈ టెక్నికల్ ఆనందం సూచించారు. శుక్రవారం పట్టణంలోని విద్యుత్ సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖలతో పోలిస్తే విద్యుత్ శాఖ పనితీరు ఎంతో గొప్పదని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరికి కావాల్సిన విద్యుత్ సకాలంలో అందిస్తూ, రాత్రి పగలు తేడా లేకుండా ఎలాంటి అంతరాయం వచ్చిన దాన్ని పరిష్కరించి వెంటనే విద్యుత్‌ను అందించడం గర్వకారణమని తెలిపారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తేనే మంచి ఫలితాలు వస్తాయని సూచించారు. ఈ సమావేశంలో డీఈ భిక్షపతి, ఏడీఈ కన్న రాజు, జేఎల్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ తోటల పరిశీలన

ఖానాపురం, ఏప్రిల్ 19: మండల కేంద్రంలోని ఆయిల్‌పామ్ తోటలను జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. ఆయిల్‌పామ్ తోటల్లో సర్పిలాకార లోగాస్ తెల్లదోమ తెగులు ఉన్నట్లు గుర్తించారు. ఈ తెగులుతో ఆయిల్ పామ్ మొక్కల్లో ఆకుల పై రసం పీల్చడంవల్ల కిరణజన్య సంయోగక్రియ తగ్గి మొక్కల ఎదుగుదల నిలిచిపోతుందన్నారు. దీని నివారణకు 1800పీపీఎమ్ గల 1ఎంఎల్ వేపనూనెను లీటరు నీటి కి కలిపి పిచికారి చేయాలన్నారు. నీటిలో కరిగే ఎరువులను డ్రిప్ పద్ధతిలో ఫర్టిగేషన్ విధానంలో ఎలా పంపాలో జైన్ డ్రిప్ ఇరిగేషన్ జోనల్ మేనేజర్ భవానిప్రసాద్ రైతులకు వివరించారు. అదే విధంగా వర్మికంపోస్ట్ యూనిట్‌ను సందర్శించారు. వేసవిలో ఆయిల్‌పామ్ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డివిజినల్ ఉద్యానశాఖ అధికారి జ్యోతి, ఫీల్డ్ ఆఫీసర్ కార్తిక్, రైతు లు కుంచారపు వెంకట్‌రెడ్డి, సుబ్బారావు, పూర్ణచందర్‌రావు, నర్సింహా రెడ్డి, సీతారామరావు, మాధవరావు పాల్గొన్నారు.

## జన జాతరకు తరలిన నాయకులు


నర్సంపేటలో బస్సును ప్రారంభిస్తున్న రవీందర్‌రావు

నర్సంపేట, ఏప్రిల్ 19: మహబూబాబాద్‌లో శుక్రవారం జరిగిన జన జాతర సభకు నర్సంపేట నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. పట్టణంలో సభకు కార్యకర్తలు తరలివెళ్ళే బస్సులను జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావు ప్రారంభి, మాట్లాడారు. పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ రెండులక్షల మెజారిటీతో గెలవడం ఖాయమన్నారు. సభకు తరలివెళ్ళిన వారిలో మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్యగౌడ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, రథన్‌కుమార్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అఖిల్, ఉత్తమ్‌కుమార్, ఓర్సుసాంబయ్య, వెంకన్న, సారంగంగౌడ్ ఉన్నారు.

- ఖానాపురం : జనజాతర బహిరంగ సభకు మండలంలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లారు. మం డల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్‌రెడ్డి జెండా ఊపి వాహనాలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల కిసాన్‌సెల్ అధ్యక్షుడు చెడిపాక ఉపేందర్, మహిళా నాయకురాలు పొల్యం ప్రమీళ, ఖలీజా, కేశపాక వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.
- చెన్నారావుపేట: జన జాతర సభకు మండలంలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లు సిద్దెన రమేష్, తప్పెట రమేష్, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, నెక్కొండ బ్లాక్ కార్యదర్శి మంద యాకయ్యగౌడ్, మాజీ సర్పంచ్ తూటి పావని, లక్క రాజు, పరమేశ్వర్, మెంతుల రమేష్, జోరు వీరయ్యగౌడ్ ఉన్నారు.
- నల్లబెల్లి: జన జాతర సభకు మండల కాంగ్రెస్ నాయ కులు తరలి వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మండల కేంద్రంలోని నాయకులతో పాటు నారక్కపేట, రుద్రగూడెం, కొండాయిపల్లి, మూడుచెక్కలపల్లి, గొల్లపల్లి, ముచ్చింపుల, బిల్యానాయక్‌తండా, ఒల్లేనర్సయ్యపల్లి తదితర గ్రామాల నుంచి భారీగా తరలివెళ్లారు. సభకు వెళ్లిన మండల నాయకులు చిట్యాల తిరుపతిరెడ్డి, మాలోతు రమేష్, అశోక్, ఇస్తారు శేకర్, శివారెడ్డి, చరణ్‌సింగ్, పెంతల కొమురరెడ్డి, పురుషోత్తం సురేష్ తదితరులు వెళ్లారు.
- దుగ్గొండి : మండలంలోని వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మహబూబాబాద్‌లో సీఎం సభకు బుధవారం వాహనాల్లో తరలి వెళ్లారు. మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రల బాబు జెండా ఊపి వాహనాలను తరలించారు. తరలి వెళ్లిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్లు ఒలిగె నర్సింగరావు, చెన్నూరి కిరణ్‌రెడ్డి, మట్ట రాజు, ప్రవీన్, గిన్నె స్వామి, ఎడెల్లి శ్రీనివాస్‌రెడ్డి, కొలిపాక భాస్కర్ బాలయ్య, రమేశ్, బాబు తదితరులు ఉన్నారు.
- నెక్కొండ : జనజాతర కాంగ్రెస్ సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతుండటంతో నెక్కొండ మండలంలోని వివిధ గ్రామాల నుండి 45 వాహనాల్లో 1500 మంది కార్యకర్తలు తరలి వెళ్లారు. సభకు తరలడానికి ముందు నెక్కొండలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్ , పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, జిల్లా ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, మండల కిసాన్‌సెల్ అధ్యక్షుడు గై లక్ష్మణ్, యూత్ అధ్యక్షుడు రావుల మైపాల్‌రెడ్డి, నాయకులు కొల్లి సుబ్బారెడ్డి, మెట్టు నర్సింహారెడ్డి, దయ్యాల వెంకట్, యాదగిరి, రామారపు శిరిష, తాటిపత్రి నాగేంద్రమ్మ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు కరువు

### సౌకర్యాలు కల్పించాలి


### నెలాఖరుకు ప్రారంభంకానున్న వరి కోతలు

ఖానాపురం, ఏప్రిల్ 19 : రైతులు ఆరుగాళం కష్టపడి పండించిన ధాన్యం విక్రయించడానికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గతంలో జరిగిన పొరపాట్లను అధిగమించి కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించి సమస్యలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతుల నుంచి డిమాండ్ వ్యక్తం అవుతుంది.

మండలంలో పాకాల ఆయకట్టులో ఈ యాసంగిలో సుమారు 13వేల ఎకరాల్లో వరిసాగు కాగా, దాదాపు 3.5లక్షల క్వింటాళ్ళ ధాన్యం దిగుబడి రానుంది. మండల వ్యాప్తంగా 19ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో ఖానాపురం పీఏసీ ఎస్ ఆధ్వర్యంలో 9 కొనుగోలు కేంద్రాలు, చెన్నారావుపేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో 2 కొనుగోలు కేంద్రాలు, ఎఫ్‌పీవోల ఆధ్వర్యంలో 5, బీడీసీఎంఎస్ ఆధ్వర్యంలో 1, హనుమాన్ రైతు పరపతి సంఘం ఆధ్వర్యంలో 1, పాకాల రైతు మిత్ర సంఘం ఆధ్వర్యంలో 1 చొప్పున కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

### ప్యాడీ క్లీనర్లు ఏర్పాటు చేయాలి...

గతంలో పలు కేంద్రాల్లో ధాన్యంలో తాలు, మట్టిపెళ్లలు ఉన్నాయని నాణ్యత సక్రమంగా లేద ని మిల్లర్లు కొర్రీలు పెట్టి క్వింటాకు సు మారు 4 నుంచి 6కిలోల కోత విధించి ధాన్యం దిగుమతి చేసుకున్న దాఖలాలు ఉన్నాయి. రైతులు తీవ్రంగా నష్ట పోయిన సంద ర్భాలు గతంలో వెలుగు చూసాయి. రైతులు నాణ్యమైన ధాన్యం విక్రయించ డానికి కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.


ధాన్యం ఆరబోసిన రైతులు (ఫైల్)

### గత తప్పిదాలు పునరావృతం కాకుండా...

మండలంలో ఈ నెలాఖరు వరకు వరికోతలు ఆరంభంకానున్న నేపథ్యంలో గత తప్పిదాలు పునరావృతం కాకుండా ముందస్తుగానే చర్యలు తీసుకొని రైతుకు అందుబాటులో కొనుగోలు కేంద్రాల్లో తాగునీటి వసతి, నీడనిచ్చే గుడారాలు, గన్నీ సంచులు, ధాన్యం రవాణా కోసం సరిపడ వాహనాలు, ప్యాడీ క్లీనర్లు, పరదాలు అందుబాటులో ఉంచి గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా చూడాలని రైతులు వేడుకుంటున్నారు.

### రైతులు నిరీక్షించకుండా కొనుగోళ్లు చేపట్టాలి


**వల్లె వీరస్వామి రైతు, ధర్మరావుపేట**



కొనుగోలు కేంద్రాల్లో రైతులు రోజుల తరబడి నిరీక్షణ లేకుండా కొనుగోళ్లు చేపట్టాలి.తాలు, తేమ, నాణ్యత పేరుతో కోతలు విధించకుండా కొనుగోళ్లు చేపట్టాలి. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలి.

### సౌకర్యాలు కల్పిస్తాం...

**ఎల్లబోయిన ఆంజనేయులు, సీఈవో, పీఏసీఎస్, ఖానాపురం**



పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రెండు, మూడు రోజులు అవుతుంది. మండలంలో వరి కోతలు ప్రారంభం కాలేదు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రాగానే కేంద్రాల్లో నీడ కోసం టెంట్లు, తాగు నీటి సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకుంటాం.